జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

కావలెను

రాష్ట్ర వ్యాప్తంగా నూతన శకాన్ని లిఖించబోతున్న

పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి

ఆంధ్రప్రదేశ్ 175 నియోజకవర్గాల నుంచి 175 మంది వాలంటీర్స్ ని నియమిస్తుంది.

ప్రతి వాలంటీర్ కు

నెలకు Rs.25,000/-

Salary ఇవ్వబడును.

విద్యా, వయసుతో సంబంధం లేకుండా ఎవరైనా వాలంటీర్ గా చేరవచ్చు.

ఆసక్తి గలవారు మీ బయోడేటాను ఆధార్ కార్డు తో సహా

మీ ప్రాంతంలో ఉన్న పార్టీ లీడర్స్ ని సంప్రదించవచ్చు.

లేదా ఈ క్రింది నెంబర్

7660027683 కి వాట్సాప్ చేయగలరు.

సంపుటి 15 సంచిక 262 విశాఖపట్నం ఆదివారం 21 మే 2023 8 పేజీలు వెల : 5.00

# రేషన్ పంపిణీ.. ఇబ్బందులకు చెక్..



# వేలిముద్రల స్థానంలో ఐరిష్

అమరావతి, :ప్రజాపాలన ప్రతినిధి: రేషన్ పంపిణీ విధానం లో మార్పులకు ఏపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటివరకు తెల్ల రేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులకు బయోమెట్రిక్ (వేలి ముద్రలు) ఆధారం గా రేషన్ పంపిణీ చేస్తుంది. ఇప్పటివరకూ ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరిస్తూ వస్తున్న సర్కార్ ఇప్పుడు ఈ కీలకమైన నిర్ణయాన్ని తీసుకొంది. నెలవారీ లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేస్తున్నా రాష్ట్రం లో పలు చోట్ల వేలి ముద్రల సమస్య ఎదురవు తుంది.ప్రతీ నెలా వేల సంఖ్యలో లబ్ధిదారులు రేషన్ తీసుకోకుండానే వెను తిరగాల్సిన పరిస్థితి నెలకొంది ఈ సమస్య తీవ్ర ను గుర్తించిన ప్రభుత్వం తక్షణ చర్యలకు ఉపక్రమించింది. ఆవేదన చెందుతు న్న లబ్ధిదారుల కు భారీ ఊరట ఇచ్చే దిశగా నిర్ణయం తీసుకుంది.ఇప్పటివరకు రేషన్ పంపిణీ లో ఉన్న వేలిముద్రల స్థానంలో ఐరిష్ (కంటి గుర్తింపు) విధానం అమల్లోకి తేవాలని నిర్ణయించింది. ఇందుకు సంబం ధించి పౌరసరఫరాల శాఖకు ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే నెల అంటే జూన్ నుంచి ఈ కొత్త విధా నంలో రేషన్ పంపిణీ చేయనున్నారు.

**ప్రస్తుతం ఎదురవుతున్న ఇబ్బందులు..**

ప్రస్తుతం ఏపీలో రేషన్ పంపిణీ కోసం లబ్ధిదారుల వేలి ముద్రలు ప్రామాణికం గా తీసుకుంటు-న్నారు. ఈ విధానం వల్ల పేదలు పలు ఇబ్బందులు పడుతున్నారు. దినసరి కూలీ లు , ఇతర చేతి వృత్తుల పేదలు వేలి ముద్రలు కోల్పోతున్న పరిస్థితి ఉంది. బయోమెట్రిక్ ద్వారా మెషీన్ లో వేలిముద్రలు పడక గంటల కొద్ది నిరీక్షించినా ఫలితం లేని పరిస్దితి. వేలి ముద్రలు పడకపోవడం తో రేషన్ ఇచ్చేందుకు సిబ్బంది నిరాకరిస్తున్నారు.ఈ నేపథ్యంలో లబ్ధిదారులు తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళారు. వారి నుంచి పదే పదే రేషన్ అందడం లేదనే ఫిర్యాదులు పెరుగుతున్న తరుణంలో ఈ ఇబ్బందులు నివారించేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ పద్ధతి కి నిర్ణయం తీసుకుంది. ఇకపై ఐరిష్ ఆధారిత ధ్రువీకరణతో రేషన్ పంపిణీ చేయాలని పౌర సరఫరాల శాఖ ను ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణ యం తో వేలిముద్రలు పడని లబ్ధి దారులకు భారీ ఊరట కలగనుంది.

**జూన్ నుంచి ఐరిష్ ద్వారా రేషన్..**

ఏపీలో ఐరిష్ ఆధారిత ఆధార్ ధ్రువీకరణ ద్వారా నిత్యావసరాలను పంపిణీ చేయను న్నట్టు-పౌరసరఫరాల ప్రకటించింది. ఇప్పటివరకు ప్రజా పంపిణీ వ్యవస్థలో ఈ-పోస్ యంత్రంలో లబ్ధిదారుల వేలిముద్రలను ధ్రువీ కరించి రేషన్ అందిస్తున్నామని, రోజువారి కూలీలు, వృద్ధులు, పలు వ్యాధిగ్రస్తులకు వేలిముద్రలు పడకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటు-న్నట్లు- ప్రభుత్వం దృష్టికి వచ్చిందని తెలిపింది.ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇకపై వేలిముద్రలు పడని వారికి ఐరిష్ ఆధారిత ఆధార్ ధ్రువీకరణ ద్వారా రేషన్ పంపిణీ కి ఆదేశాలు జారీ చేసిందని వెల్లడించింది.

**9260 వాహనాల్లో ఐరిష్ పరికరాలు..**

రేషన్ లబ్ధిదారుల ఇబ్బందులు తొలగించేందుకు చర్యలు తీసుకున్న ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 9,260 ఎండీయూ వాహనాల్లో కొత్తగా ఐరిష్ (కంటి) పరికరాలను అమర్చనుంది.జూన్ నెల నుండి వేలిముద్రలతో పాటు- ఐరిస్ ఆధారిత ధ్రువీకరణను ప్రామాణికంగా తీసుకుని నిత్యావసరాలు, బియ్యం పంపణీ చేయనున్నారు.

# కర్ణాటక ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య ప్రమాణస్వీకారం..



కర్ణాటక : ప్రజాపాలన ప్రతినిధి: కర్ణాటక ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. బెంగళూరులోని కంఠీరవ స్టేడియంలో గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. మరో ఎనిమిది మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. వారిలో జి. పరమేశ్వర్ (ఎస్సీ), కేహెచ్ మునియప్ప (ఎస్సీ), కేజే జార్జ్ (మైనార్టీ - క్రిస్టియన్), ఎంబీ పాటిల్ (లింగాయత్), సతీష్ జార్కిహోళి (ఎస్టీ - వాల్మీకి), ప్రియాంక్ ఖర్గే (ఎస్సీ), రామలింగారెడ్డి (రెడ్డి), బిజెడ్ జమీర్ అహ్మద్ ఖాన్ (మైనార్టీ -ముస్లీం)లు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు.ప్రమాణస్వీకార కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీతో పాటు ఏడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. వారిలో తమిళనాడు సీఎం స్టాలిన్, బీహార్ సీఎం నితీశ్ కుమార్, రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్, ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ బఘేల్, హిమాచల్‌ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్‌సింగ్, జార?ండ్ సీఎం హేమంత్ సోరెన్, పుదుచ్చేరి సీఎం రంగస్వామి ఉన్నారు. వీరితోపాటు సీనియర్ పొలిటీషియన్‌లు శరద్‌పవార్, వామపక్ష నాయకులు సీతారాం ఏచూరి, డీ.రాజా, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్, బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వియాదవ్, పీడీపీ అధ్యక్షురాలు, జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ, నేషనల్ కాన్ఫరెన్స్ సీనియర్ నేత, జమ్ముకశ్మీర్ మాజీ సీఎం ఫరూక్ అబ్దుల్లా, సినీనటుడు కమల్‌హాసన్ తదితరులు ఈ ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు.

# కర్ణాటక ప్రజలకు స్వచ్ఛమైన పాలనను అందిస్తాం: రాహుల్ గాంధీ



బెంగళూరు : ప్రజాపాలన ప్రతినిధి: కర్ణాటక ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం స్వచ్ఛమైన, అవినీతి రహిత పాలన అందిస్తుందని రాహుల్ గాంధీ తెలిపారు. కర్ణాటకలో ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. కర్ణాటక ముఖ్యమంత్రిగా సిద్దరామయ్య, డిప్యూటీ సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. వారి చేత కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ ప్రమాణం చేయించారు. బెంగళూరులోని కంఠీరవ స్టేడియంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. తమ పార్టీ ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటుందని చెప్పారు. 'మేం 5 వాగ్దానాలు చేశాం.. 2 గంటల్లో అమలు చేస్తాం. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎలా గెలిచిందంటూ వివిధ విశ్లేషణలు జరిగాయి. నేను చెప్పదలచుకున్నది ఒక్కటే. పేదలు, దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన తరగతులకు బాసటగా నిలవడం వల్లే కాంగ్రెస్ గెలుపు సాకారమైంది. కర్ణాటకలో విద్వేష మార్కెట్‌లు మూతబడి.. లక్షలాది ప్రేమ దుకాణాలు తెరుచుకున్నాయి. కాంగ్రెస్ గెలిచిన తర్వాత.. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎలా గెలుపొందింది అని చాలా విషయాలు రాశారు. భిన్నమైన విశ్లేషణలు జరిగాయి.. పేదలు, దళితులు, ఆదివాసీలకు వెన్నంటే ఉన్నందున కాంగ్రెస్ గెలిచిందని తెలిపారు.

# పంజాబ్ సరిహద్దుల్లో పాకిస్థాన్ డ్రోన్లు...

## నేలకూల్చిన బీఎస్ఎఫ్ దళాలు



అమృత్‌సర్(పంజాబ్): ప్రజాపాలన ప్రతినిధి: పంజాబ్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి శుక్రవారం ఎగురుతున్న రెండు పాకిస్థాన్ డ్రోన్‌లను బీఎస్ఎఫ్ కూల్చివేసింది. పంజాబ్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వద్ద భారత్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తున్న పాకిస్థాన్‌కు చెందిన రెండు డ్రోన్‌లను బీఎస్ఎఫ్ దళాలు నేలకూల్చాయి. డ్రోన్‌లలో ఒకదాంట్లో అనుమానాస్పద మత్తుపదార్థాలు ఉన్న బ్యాగ్‌ని కూడా బీఎస్ఎఫ్ దళాలు స్వాధీనం చేసుకున్నాయి.అమృత్‌సర్ జిల్లాలోని ఉధర్ ధరివాల్ గ్రామం నుంచి డ్రోన్లను స్వాధీనం చేసుకున్నట్లు బీఎస్ఎఫ్ ప్రతినిధి తెలిపారు.అమృత్‌సర్ జిల్లాలోని రత్తన్ ఖుర్ద్ గ్రామం నుంచి రాత్రి 9:30 గంటలకు బీఎస్ఎఫ్ దళాలు కాల్పులు జరిపిన తర్వాత డ్రోన్ ను స్వాధీనం చేసుకున్నట్లు ప్రతినిధి పేర్కొన్నారు.రెండవ డ్రోన్‌కు 2.6 కిలోల రెండు హెరాయిన్ ప్యాకెట్లను జోడించగా వాటిని కూడా స్వాధీనం చేసుకున్నట్లు బీఎస్ఎఫ్ ప్రతినిధి తెలిపారు.

## నిరంకుశ ప్రభుత్వ ఏజెన్సీ పాలన అంటూ

# కేంద్రంపై మమత మండిపాటు..!



కలకత్తా:ప్రజాపాలన ప్రతినిధి: కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వంపై బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మండిపడ్డారు. పని చేసేందుకు కేంద్ర యంత్రాంగం అనుమతించడం లేదని ఆరోపించారు. స్కూల్ రిక్రూట్‌మెంట్ స్కామ్ విచారణ కోసం కోల్‌కతా సీబీఐ కార్యాలయానికి తృణమూల్ కాంగ్రెస్ నేత అభిషేక్ బెనర్జీ హాజరయ్యారు. ఈ క్రమంలోనే మమతా ఈ ఆరోపణలు చేశారు. కేంద్రంలోని నిరంకుశ ప్రభుత్వ ఏజెన్సీ పాలన.. మా పనని సవాల్‌గా మార్చిందంటూ ట్వీట్ చేశారు. 34 ఏళ్ల రాక్షస పాలనను మార్చి.. పశ్చిమ బెంగాల్‌లో 'మా, మతి, మనుష్' (తల్లి, భూమి, ప్రజలు) ప్రభుత్వాన్ని ప్రారంభిస్తామని 2011లో ఈ రోజున ప్రమాణం చేశామని మమతా బెనర్జీ మరో ట్వీట్‌లో పేర్కొన్నారు.ఈ రోజు మనం చేసిన ప్రతిజ్ఞను పునరుద్ఘాటిస్తున్నామని, ప్రజల కోసం మనల్ని మనం పునరంకితం చేసుకుంటున్నామన్నారు. పాఠశాల ఉద్యోగాల కుంభకోణం కేసులో టీఎంసీ నాయకుడు, మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీ విచారణ కోసం సీబీఐ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. కుంభకోణం విచారణకు సంబంధించి ఇంతకు ముందు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ టీఎంసీ అగ్రనేతలకు సన్నిహితుడిగా పేర్కొంటున్న సుజయ్ కృష్ణ భద్ర నివాసంపై దాడులు నిర్వహించినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి.



# అవినాష్ రెడ్డికి మళ్లీ నోటీసులు..

హైదరాబాద్ ప్రజాపాలన ప్రతినిధి: వైఎస్ వివేకా హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కడప ఎంపీ అవినాష్ రెడ్డికి సిబిఐ మళ్లీ నోటీసులు జారీ చేసింది.. ఈనెల 22న విచారణకు రావాలని సీబీఐ అధికారులు ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. కాగా మొదట ఈనెల 16న విచారణకు రావాలని అవినాష్ రెడ్డి కి సీబీఐ నోటీసులు ఇచ్చింది. అయితే ముందే ఫిక్స్ అయిన షెడ్యూల్ కారణంగా విచారణకు హాజరు కాలేనని..4 రోజుల సమయం ఇవ్వాలని సీబీఐకి లేఖ రాశారు. దీనితో ఈనెల 19న విచారణకు రావాలని సీబీఐ రెండోసారి నోటీసులు జారీ చేసింది..అయితే తన తల్లికి అనారోగ్య కారణంగా విచారణకు రాలేనని రెండోసారి కూడా అవినాష్ సీబీఐ విచారణకు డుమ్మా కొట్టారు. ఈ క్రమంలో సీబీఐ మూడోసారి నోటీసులు జారీ చేసింది. అయితే మొదటి రెండు సార్లు విచారణకు డుమ్మా కొట్టిన అవినాష్ ఈసారైనా విచారణకు వస్తారా అనేది ఉత్కంఠ నెలకొంది. ఒకవేళ విచారణకు రాకపోతే సీబీఐ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారు? తప్పనిసరైతే అరెస్ట్ చేస్తారా? లేక కోర్టును ఆశ్రయిస్తారా? సీబీఐ ప్లాన్ ఏంటనేది ప్రస్తుతానికి సస్పెన్సే..



# గొల్లలగుంట గ్రామంలో విత్తన గులికలు తయారీపై రైతులకు అవగాహన

జగ్గంపేట ప్రజాపాలన ప్రతినిధి : గొల్లలగుంట గ్రామంలో విత్తన గులికలు తయారీపై అవగాహన సదస్సు ప్రకృతి వ్యవసాయ విభాగం డిస్టిక్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎలియాజర్ వారి ఆదేశాల మేరకు గొల్లలగుంట గ్రామంలో విత్తన గులికల తయారీ పై అవగాహన సదస్సు ఏర్పాటు చేసి సామూహికంగా రైతులతో విత్తన గులికలు చేయించడం జరిగింది. పెల్లెటైజేషన్ (విత్తన గులికలు) తయారి విదానం (పి.మ్.డి.స్)



విత్తన గులికలుగా మార్చవలసిన విత్తనాలు :

అనుములు, కందులు, మినుములు, పెసలు, జొన్నలు, సజ్జలు, అలసందలు, మొక్కజొన్న, వప్పు శనగ, గోరుచిక్కుడు, చిక్కుడు, గోంగూర, ఉలవలు, బఠాణీలు, బీర, నేతి బీర, సొర, గుమ్మడి, బుడిదగుమ్మడి, పుచ్చ, బెండ, పిల్లి పెసర, కుసుమలు, పొద్దుతిరుగుడు, అవిశ, జీలుగ, జనుము, కాకర, వెల్వెట్ బీన్స్, ఫ్రెంచి బీన్స్.

పలురకాల విత్తనాలను విత్తన గులికలుగా తయారు చేయుటకు కావలసినవి:

1 . సేకరించిన విత్తనాలకు సరిపడా బీజామృతం

2. మెత్తగా పొడిచేసి జల్లించిన బంకమట్టి పొడి ( ప్రతి 10 కిలోల విత్తనాలకు దాదాపు 10 నుండి 20 కేజీ ల బంకమట్టి పొడినివాడాలి )

3. వెత్తగా పొడిచేసిన ఘనజీవామృతం ( ప్రతి 10 కిలోల విత్తనాలకు దాదాపు 5 నుండి 10 కేజీల వెత్తగా పొడిచేసిన ఘనజీవామృతాన్ని వాడాలి )

4. విత్తనాలపై జల్లుకోవడానికి సరిపడా నీళ్ళు

5. జల్లెడ పట్టిన బూడిద

6. పరికరాలు : ఒక స్ప్రేయర్ , గోనె సంచి

పలురకాల విత్తనాలను విత్తన గులికలుగా తయారు చేయు విధానము

1. ముందుగా సేకరించిన విత్తనాలను విడివిడిగా తీసుకొని గోనెసంచిలో వేసి బీజామృతముతో విత్తనశుద్ధి చేయాలి.

2. ఆ తరువాత గోనెసంచిని కుదుపుతూ బంకమట్టిని కలుపుకోవాలి . మధ్య మధ్యలో నీళ్ళను చిలకరించాలి.

3. బంకమట్టికి అనుబంధంగా పొడిచేసిన ఘణజీవామృతాన్ని జల్లుకోవాలి . మధ్య మధ్యలో నీళ్ళను చిలకరించాలి.

4.ఆ తరువాత ఘణజీవామృతానికి అనుబంధంగా బూడిదను జల్లుకోవాలి.

5. ఈ విధంగా ప్రతి విత్తనాన్ని విడివిడిగా తీసుకొని గులికలుగా తయారు చేసుకోవాలి.

విత్తనానికి ఇన్ని పొరలు ఎందుకంటే ... విత్తనాలను విత్తన శుద్ధిచేసుకోవడం వలన విత్తనము నుండి కాని , భూమి నుండి కాని వచ్చే తెగుళ్ళను నివారించవచ్చు .

- బంకమట్టి వేసుకోవడము వలన విత్తనములోని తేమశాతము ఆవిరికాకుండా 6 నుంచి 10 లేక 12 శాతము ఉండునట్లు కాపాడు తుంది . విత్తన గులికల తయారీలో ఘనజీవామృతం ఎందుకు వాడతామంటే ఘనజీవామృతం విత్తనంలోని జీవాన్ని ప్రేరేపిస్తుంది . అంటే ఘనజీవామృతంతో విత్తన గులికలు చేసిన విత్తనాలను మనం భూమి పై వేసుకున్న మల్చ్ కు దగ్గరగా వేసుకున్నప్పుడు భూమిలో వున్న సూక్ష్మ జీవులు దానిని ఆశిస్తాయి . అప్పుడు వాటి చర్యల ఫలితంగా నీరు విడుదల అవుతుంది . ఈ నీరు డ్రై సోయింగ్ లో మనం వేసిన విత్తనాలు మొలకెత్తుటకు దోహదం చేస్తుంది

విత్తన గులికల వలన ఉపయోగాలు

1. వాటిలో బంకమట్టి విత్తనాలను ఆచరణీయంగా చేస్తుంది, ఘనజీవామృతం బయో-ఇనోక్యులమ్‌గా ఉపయోగించబడుతుంది (మొలకెత్తిన తర్వాత రూట్‌లో ఉండే బ్యాక్టీరియా ఎంజైమ్‌లు మరియు కో-ఎంజైమ్‌లను అందిస్తుంది %డ% తేమ మరియు పోషకాలను సపోర్ట్ చేస్తుంది) మరియు బూడిద పూత ఘనజీవామృతం మరియు బంకమట్టిలో ఉన్న తేమను గమనించడం ద్వారా తేమ స్థాయిని నియంత్రిస్తుంది. అని ప్రకృతి వ్యవసాయం వారు వివరించారు. కె.గౌరీ, పడాల రాజేష్, డి. ఉమాదేవి, డి. లోవ లక్ష్మి గ్రామ రైతులు పాల్గొన్నారు

## యూనియన్ సభ్యురాలు ఆర్టీసీ గ్యారేజీలో మజ్జిగ పంపిణీ



గోకవరం ప్రజా పాలన మే 20: మండల కేంద్రమైన గోకవరం ఆర్టీసీ గ్యారేజీ లో యూనియన్ సభ్యురాలు శాంతి కమల వల్ల నాన్న ఎన్.స్ నారాయణ ను .జ్ఞాపకార్థం సందర్భంగా శనివారం ఆర్టిసి ఉద్యోగులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి డిపో మేనేజర్ యు. రామన్న ముఖ్యఅతిథిగా పాల్గొని ఉద్యోగులకు మజ్జిగ ఇస్తూ.స్పాన్సర్ శాంతి కమలను అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసిన ఎంప్లాయిస్ యూనియన్ నాయకులను ఇక ముందు కూడా జరిగేలా చూడాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డిపో సూపర్డెంట్ అడ్డాల అప్పారావు, ఎం.ఫ్ మూర్తి, ఎంప్లాయిస్ యూనియన్ డిపో చైర్మన్ పైడిమళ్ళ లక్ష్మణ్ రావు, ప్రెసిడెంట్ ప్రగడ ప్రసాద్, గ్యారేజి కార్యదర్శి శ్రీను, ఎ న్ మ్ యు కార్యదర్శి మేడా శ్రీనివాస్ మురళీ,నాయకులు ఏ. శ్రీనివాస రావు, ఎచ్.సి రత్నం డిపో ఉద్యోగులు అందరూ మజ్జిగ తీసుకుని కమలను అభినందించారు.

## నాటు నాటు సంగీత విభావరి ప్రోగ్రాం పోస్టర్ ను ఆవిష్కరించిన పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్



పల్నాడు జిల్లా. నరసరావుపేట. మే 20 (ప్రజాపాలన ప్రతినిధి.): సుశీల్ ఎంటర్టైన్ మీడియా ఆధ్వర్యంలో రేపు అనగా ఆదివారం సాయంత్రం 6గంటలకు పల్నాడు జిల్లా నరసరావుపేటలోని భువనచంద్ర టౌన్ హాల్ లో యం.యం.కీరవాణి ఆర్ ఆర్ ఆర్ సినిమాలోని నాటునాటు పాట ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపునిచ్చిన సంధర్భాన్ని పురస్కరించుకొని సుశీల్ మీడియా ఎంటర్టైన్మెంట్ అధినేత డా.బి.ఆర్.సుశీల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన నాటు నాటు సంగీత విభావరిలో ప్రముఖ గాయనీ గాయకులు కీరవాణి స్వరపరచిన పాటలను అద్భుతంగా పాడి వినిపిస్తారని కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ విచ్చేసి జయప్రదంచేయాలని పిలుపునిస్తూ పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ సంగీత విభావరి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సుశీల్ మీడియా ఎంటర్టైన్ మెంట్ అధినేత డా.బి.ఆర్ .సుశీల్ కుమార్,ప్రముఖ గాయకులు ఓగూరి నాగేశ్వరావు,తెలుగు సేవా సమితి అధ్యక్షులు డా.గోదా రమేష్ కుమార్ మరియు సుశీల్ ఎంటర్టైన్ మెంట్ ప్రతినిధులు ఈకార్యక్రమంలో లింగంగుంట్ల మాజీ సర్పంచ్ పొన్నపాటి ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

## బీఎస్పీ ఆధ్వర్యంలో ఎమ్మిగనూరులో జూన్ 11న జరుగు బీసీ గర్జన సభను జయప్రదం చేయండి

### బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు బిఎస్పీ తోనే సాధ్యం

యెమ్మిగనూరు ప్రజాపాలన ప్రతినిధి : బహుజన సమాజ్ పార్టీ కర్నూలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జూన్ 11న ఆదివారము ఎమ్మినూరు పట్టణంలోని కుర్ని కళ్యాణమండపంలో జరుగు బీసీ గర్జన సభను విజయవంతం చేయాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంచాల లక్ష్మీనారాయణ జిల్లా అధ్యక్షులు జై రాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి ఎర్రన్న జిల్లా నాయకులు బోయ గుడిసె చంద్రన్న జిల్లా ఉపాధ్యక్షులు సామేలు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బోయ రవికుమార్ లు పిలుపునిచ్చారు శనివారము ఎమ్మిగనూరు నియోజకవర్గం మరియు మంత్రాలయం నియోజకవర్గం అధ్యక్షులు నాగరాజు, మోహన్ కుమార్ అధ్యక్షతన స్థానిక శివ సర్కిల్ నందు ఉన్న బి ఎస్ పి కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గం ప్రాంతీయ కార్యాలయం నందు బహుజన సమాజ్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు అనంతరం పట్టణంలోని స్థానిక బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బీసీ గర్జన సభకు సంబంధించిన కరపత్రాలను వారు విడుదల చేశారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎమ్మిగనూరులో జూన్ 11న జరిగే బీసీ గర్జన సభకు ముఖ్య అతిథులుగా బి.ఎస్.పి రాష్ట్ర అధ్యక్షులు బక్క పరంజ్యోతి మరియు రాష్ట్ర కోఆర్డినేటర్ ఆర్ జె మల్లికల్ మరియు రాష్ట్ర నాయకులు హాజరవుతున్నట్టు వారు తెలిపారు బహుజన్ సమాజ్ పార్టీ బీసీలకు చట్టసభలైన అసెంబ్లీ మరియు పార్లమెంటు నియోజకవర్గం లలో రాజకీయ రిజర్వేషన్లు కల్పించడం ద్వారా రాజకీయ సమానత్వాన్ని సాధించే లక్ష్యంగా కృషి చేస్తున్నదని గుర్తు చేశారు. బిఎస్పి వ్యవస్థాపకులు మాన్య శ్రీ కాన్షిరాం పోరాటపలితంగా దేశంలో మండల్ కమిషన్ ఏర్పాటు చేయడమే కాకుండా బీసీలకు స్థానిక సంస్థలైన ఎంపిటిసి జడ్పిటిసి సర్పంచ్ మరియు మున్సిపాలిటీ స్థానాలలో బీసీలకు 27% రాజకీయ రిజర్వేషన్లను అమలు చేయడం జరిగింది అన్నారు. మాన్య శ్రీకాంత్ మరణానంతరం బిఎస్పీ జాతీయ అధ్యక్షురాలు బెహెన్సీ కుమారి మాయావతి గారు బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించేందుకు పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి బీసీ జనాభాను లెక్క పెట్టాలని పోరాటం చేస్తున్నారని అన్నారు అన్నారు. బెహన్ కుమారి మాయావతి గారి ఆదేశాల మేరకు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు బక్కాపరంజ్యోతి రాబోయే 2024 అసెంబ్లీ ఎన్నికలలో బీసీలకు రాష్ట్రంలో 100 సీట్లు కేటాయించడమే కాకుండా ప్రజలు బిఎస్పీని గెలిపిస్తే రాష్ట్రానికి బీసీ ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించడం జరిగిందని తెలిపారు. కావున బిసి సోదరులారా కర్నూలు జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానం లలో బీసీ లు అధికంగా ఉన్న నియోజకవర్గం లలో బీసీలకే అసెంబ్లీ స్థానాలు కేటాయించడం ద్వారా బీసీలకు తగిన ప్రాధాన్యతను కల్పించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా జూన్ 11న ఎమ్మిగనూరులోని కుర్ని కళ్యాణ మండపం నందు జరిగే బీసీ గర్జనకు వేలాది సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎద్దుల నాగేష్ ఎమ్మిగనూరు నియోజకవర్గం ఇంచార్జ్ బంగారప్ప ఉపాధ్యక్షులు ప్రసాద్ నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఈరేష్, బివియఫ్ చంద్ర, ఎమ్మిగనూరు మండలం ఇంచార్జ్ బోయ మహేంద్ర మంత్రాలయం నియోజకవర్గం ఇంచార్జ్ లక్ష్మన్న మంత్రాలయం నియోజకవర్గం కార్యదర్శి యాకోబు మంత్రాలయం నియోజకవర్గం కోశాధికారి కాజా తదితరులు పాల్గొన్నారు.



## కబేళా కు తరలిస్తున్న 200 గోవులు స్వాధీనం

నూజివీడు, మే 20, ప్రజాపాలన ప్రతినిధి: మానవత్వం లేకుండా రెండు ఐశ్చర్ వ్యానుల్లో 200 గోవులను కుక్కి కబేళా కు తరలిస్తుండగా హనుమాన్ సేనా కార్యకర్తలు వ్యానులను పట్టుకొని పోలీసులకు అప్పగించిన సంఘటన నూజివీడు పట్టణంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. నూజివీడు పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఎలమంచిలి నుండి హైదరాబాద్ కు అక్రమంగా 200 గోవులను రెండు ఐశ్చర్ వ్యానుల్లో తరలిస్తున్నారని సమాచారం రావడంతో నూజివీడు పట్టణంలో హనుమాన్ సేన సభ్యులు శుక్రవారం రాత్రి వ్యానులను నిలిపివేసి సంబంధిత సమాచారాన్ని నూజివీడు ట్రాఫిక్ ఎస్ఐ రాధాకృష్ణారెడ్డి కి అందించారు. ఈ నేపథ్యంలో రెండు ఐశ్చర్ వ్యానులను తిరువూరు రోడ్డులోని పెట్రోల్ బంకు వద్ద స్వాధీనం చేసుకొని పట్టణ పోలీస్ స్టేషన్ కు తరలించారు. గోవులను గోశాలకు తరలించి, తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ రాధాకృష్ణారెడ్డి తెలిపారు. హనుమాన్ సేన సభ్యులు కలగర శివ సాయి, దుర్గాప్రసాద్, పవన్, సూర్య, కందుల సత్యనారాయణ లను పోలీసులు, పలువురు సామాజికవేత్తలు అభినందించారు.



## రైతులకు నవధాన్యాల కిట్లు పంపిణీ



విజయనగరం ప్రజా పాలన ప్రతినిధి : ఎస్.కోట మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రైతు భరోసా కేంద్రాల్లో నవధాన్యాలు ఉపయోగాలను వ్యవసాయి సిబ్బంది వివరించారు. నవధాన్యాల సాగుతో నేల ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ధర్మవరం, మామిడిపల్లి, ఆలుగబెల్లి, పోతనపల్లి, గోపాలపల్లి, కిల్తంపాలెం, పెద్దకండేపల్లి, పడ్డవర వెంకటరమణపేట గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నవధాన్యాలను కలిపి కిట్లుగా తయారు చేసి విఎఎ ఆధ్వర్యంలో రైతులకు నవధాన్యాల కిట్లు పంపిణీ చేశారు. రైతులందరూ తప్పనిసరిగా వరి వేసే ప్రధాన పొలంలో నాటుకోవాలన్నారు. ఈ నవధాన్యాలను 20 నుంచి 30 రకాల విత్తనాలను సేకరించడం జరిగిందన్నారు. విత్తనాలను 10 కేజీల చొప్పున నవధాన్యాలకిట్లుగా తయారు చేయడం జరిగిందని, కిట్లను మే జూన్ నెలలో కురిసే వర్షాలకు పొలంలో దుక్కు చేసి వేద జల్లుకోవాలని సూచించారు. తరువాత 45 రోజులు నుండి 50 రోజులకు వచ్చిన నవధాన్యాల రొట్టను నేలలో కలియుదునుకోవాలన్నారు. అలా చేయడం వలన నేలలో అనేక రకాల సూక్ష్మజీవులు పెరిగి పంటకు తగిన పోషకాలు లభిస్తాయని వివరించారు. ఇలా లభించిన పోషకాలతో పంటను ఆరోగ్యంగా పెంచుకోవచ్చునని, పంటలో వచ్చు కలుపు మొక్కలు తగ్గుతాయన్నారు. రైతుకు యూరియా, డిఏపి లాంటి రసాయనక ఎరువులు ఖర్చు తగ్గుతుందన్నారు. రసాయనిక పురుగుమందులు ఖర్చు తగ్గుతుందని, ఆరోగ్యవంతమైన పంట పండడం వలన రైతుకు ఆరోగ్యకరమైన ఆహారం లభిస్తుందన్నారు. రైతుకు కావలసిన నవధాన్యాల కిట్లను మండలానికి సంబంధించిన ప్రకృతి వ్యవసాయ సిబ్బంది 10 కేజీల నవధాన్యాలను ఆర్‌బికెల ద్వారా అందించడం జరుగుతుందన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతు భరోసా కేంద్రం సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎస్.నాగమణి, ఎ.ఈశ్వరమ్మ, జె.నాని, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

## సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ




ఏలూరు: జిల్లా పోలీసు యంత్రాంగం గత నెల ఏప్రిల్ నెలలో శాంతి భద్రతల పరిరక్షణ కొరకు నేర అదుపునకు ప్రత్యేక ప్రతిభను కనబరిచినటువంటి సిబ్బందికి ఈ రోజు అనగా 20.05.2023 వ తేది నాడు ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం లో గల సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ శ్రీమతి మేరీ ప్రశాంతి ఐపీఎస్ వారు నగదు మరియు ప్రశంసా పత్రములను అందించి అభినందించినారులి.నిడమర్రు పోలీస్ స్టేషన్ పరిధిలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి యొక్క విగ్రహం ధ్వంసము చేసిన కేసులో వెనువెంటనే స్పందించి ముద్దాయిలు 11 మందిని అదుపులోనికి తీసుకొని శాంతి భద్రతలను కాపాడిన విషయంలో సిసిఎస్ డిఎస్పి అప్పటి ఏలూరు ఇంఛార్జి డిఎస్పీ శ్రీ జివిఎస్ పైడేశ్వర రావు కి, గణపవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ గణపవరం ఎస్సై బి వెంకటేశ్వరరావు, స్వామి హెడ్ కానిస్టేబుల్ 1760 జి వినాయకుడు, పోలీస్ కానిస్టేబుల్ 1412 ఎస్ నాగరాజు, పోలీస్ కానిస్టేబుల్ 1880 బి శివకుమార్ పోలీస్ కానిస్టేబుల్ 1205 శ్రీనివాస్, పోలీస్ కానిస్టేబుల్ 2127 సిహెచ్ ధనంజయ, హెూంగార్డు 852 పి. జగపతి, కథలకు ఎక్కువ కేసులలో రాజీచేసిన నేపథ్యంలో ఏలూరు టూ టౌన్ ఇన్స్పెక్టర్ పి చంద్రశేఖర్ గారు కానిస్టేబుల్ 2066 పి చిరంజీవి,నూజివీడు రూరల్ ఎస్ఐ టి. రామకృష్ణ పోలీస్ కానిస్టేబుల్ సురేష్ కు,గత నెలలో 113 సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకుని సెల్ ఫోన్ దారులకు స్వాధీనం చేసిన నేపథ్యంలో ఏలూరు సి.సి.యస్ ఇన్స్పెక్టర్ సిహెచ్ మురలీకృష్ణ గారు హెడ్ కానిస్టేబుల్ రవి కుమార్ అనువారులకు నగదు బహుమతి మరియు ప్రశంసా పత్రములు జిల్లా ఎస్పీ అందించి అభినందించినారు.

## సి హెచ్ సి లో మెరుగైన వైద్యం



గోకవరం ప్రజాపాలన మే 20 : ప్రభుత్వ ఆసుపత్రి లో మెరుగైన వైద్యం అందిస్తున్నామని ప్రధాన వైద్యురాలు డా.వనజాకుమారి తెలిపారు. ఏజెన్సీ ప్రాంతమైన ఆర్.ఆర్. కొలనీకి చెందిన వై. హరీష్ 29 సం. యువకునికి అతి పెద్ద సర్జరీ చేసామని డా.వనజాకుమారి శనివారం విలేకరులకు తెలిపారు. హరీష్ కు ఎడమచేతిలో ప్రమాధవశాత్తు పెద్ద గాజుపెంకు లోపలికి విరిగి 6 నెలలుగా ఉండిపోయి చాలా బాధ పడుతున్నాడని దీనికి సంబందించిన శస్త్ర చికిత్స ఆసుపత్రి జనరల్ సర్జన్ డా.రవి కుమార్ నిర్వహించారని తెలిపారు. ఈ సందర్భంగా డా.వనజా మాట్లాడుతూ గోకవరం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతినెలా సుమారు 70 వరకు డెలివరీలు ,30 శస్త్ర చికిత్సలు. ప్రతీవారం ఆర్థో సేవలు వెరీ వెరీ గా అందించబడుతున్నాయన్నారు. ఇటీవల ప్రజా పాలన పేపర్లలో వచ్చిన న్యూస్ కు డాక్టర్ వనజ కుమారి స్పందిస్తూ ఆసుపత్రి ఆవరణ లో లక్షల విలువైన జనరేటర్ వినియోగంలోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు, గర్భిణీ స్త్రీలు విభాగంలో ఏ సీ ని కూడా ఉపయోగిస్తున్నారని తెలిపారు నూతన 50 పడకల ఆసుపత్రి నిర్మాణము ఉన్నది ప్రస్తుత సి హెచ్ సి లో స్థలాభావము వల్ల రోగులు పేరుగుతున్నారు. స్వల్ప ఇబ్బందులు ఎదురవ్వడము వలన ప్రజలు సహకరించాలని. అత్యవసర పరిస్థితుల్లో రోగులను స్ట్రేచ్చేర్ మీద తీసుకొని వెళుటకు స్థలము చాలక తిరుగుటకు ఇబ్బంది అవుతుందని కావున ప్రజలు సహకరించాలని ఆమె కోరారు. ఆసుపత్రిలో సిబ్బంది అందరికి ఫేస్ రికగ్నిషన్ ఆప్ అమలవుతుందని అందరినీ సమన్వయ పరచి విధులు మరింత ప్రజలకు చేరువలో తెచ్చుటకు అందరూ కృషి చేస్తున్నారని, చిన్నచిన్న అవరోధాలు ఎదురైన ప్రజలు సహకరించి ఆసుపత్రి అభివృద్ధి కి తోడ్పడాలని ఆమె తెలిపారు.

## కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి



ఆగిరిపల్లి, మే 20, ప్రజాపాలన ప్రతినిధి : నూజివీడు నియోజకవర్గం పరిధిలోని ఆగిరిపల్లి మండలం నూగొండపల్లి గ్రామానికి చెందిన కందుల నాగార్జున (35) కుటుంబ కలహాల నేపథ్యంలో శనివారం కలుపు మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సమీపంలోని వారు గమనించి అందించిన సమాచారంతో 108 అంబులెన్స్ లో బాధితుడిని నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం విజయవాడ ఆసుపత్రికి మెరుగైన వైద్య సేవలకు తరలిస్తున్నారు. ఆగిరిపల్లి ఎస్సై నంబూరి చంటిబాబు కేసు దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉండగా, పోలీసులు ఈ కేసుకు సంబంధించి అన్ని కోణాలలో దర్యాప్తు చేపట్టారు.

## నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాలను విజయవంతం చేయండి



పల్నాడు జిల్లా. నరసరావుపేట. మే 20 (ప్రజాపాలన ప్రతినిధి ): నందమూరి తారకరామారావు శతజయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని పలనాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జీవీ ఆంజనేయులు అన్నారు. శనివారం జీవి ఆంజనేయులు మాట్లాడుతూ ది.22-05-23 తేదీ అనగా సోమవారం ఉదయం 9:30ని తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రివర్యులు స్వర్గీయ కీ.శే. శ్రీ నందమూరి తారక రామారావుగారి శత జయంతి ఉత్సవాలలో భాగంగా పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణం లోని జమిందార్ ఫంక్షన్ హాల్ నందు టిడిపి జిల్లా మినీ మహానాడు కార్యక్రమం జరుగును. ఈ కార్యక్రమానికి పలువురు రాష్ట్ర, జిల్లా తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు హాజరుకానున్నారు. కావున ఈ కార్యక్రమానికి పల్నాడు జిల్లా లో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు %ద% అన్ని విభాగాల అనుబంధ సంఘాల నాయకులు మరియు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు అందరూ వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలసిందిగా జిల్లా పార్టీ అధ్యక్షులు జివి. ఆంజనేయులు తెలిపారు.

## అవంతి ఆదేశాలతో ఆనందపురం మండల పార్టీ అధ్యక్షులు ఆధ్వర్యంలో ఆగని నిరసన జ్వాల




భీమిలి ప్రజాపాలన ప్రతినిధి మే 20:ప్రతీ పేదవాడి సొంతింటి కల అయిన జగనన్న ఇళ్ళు నిర్మాణం విషయంలో అపహాస్యపు అవహేళన మాటలు ఆడి ఆడిన ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు గారు తక్షణమే తన మాటలు వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆనందపులం మండల పార్టీ అధ్యక్షుడు బంక సత్యం గారి ఆధ్వర్యంలో మండలం నాయకులు సమైక్య సహాయ సహకారాలు తో చంద్ర బాబు డౌన్ డౌన్ పేద బడుగు బలహీన వర్గాల వారికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ నిరసన ర్యాలీ చేపట్టడం జరిగింది. కార్యక్రమం ను ఉద్దేశించి పార్టీ అధ్యక్షులు బంక సత్యం గారు మాట్లాడుతూ గత ప్రభుత్వం లో జన్మభూమి కమిటీలు ఏర్పాటు చేసి పసుపు చొక్కా వేసుకున్న వాడికే పథకం అయినా ఇళ్ళు అయినా మరి ఏదైనా సరే అనేలా పార్టీ – కుల వివక్ష తో పాలన అందించి పేదవారిని బుడుగు బలహీన వర్గాల వారిపై నిర్లక్ష్యం చూపిన చంద్ర బాబు గారు వైసిపి ప్రభుత్వం ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గారు అందించే సెంటు భూమి లో ఇళ్ళు కట్టుకొని సంతోషంగా ఉంటున్న పేదలు పట్ల కుట్రలు కుతంత్రాలు తో నీచమైన మాట్లాడుతున్నారని సెంటు భూమి లో శవాన్ని కప్పిపెట్టడానికి అని హేళన చేసిన చంద్ర బాబు కు అమరావతి భూములు పేరుతో దోచుకున్నది చాలక అక్కడ ఉన్న పేదవారికి ఇళ్ళు ఇస్తుంటే ఓర్వలేక ఈరోజు బుడుగు బలహీన వర్గాల వారి మనోభావాలు దెబ్బతినే విధంగా హేళనగా మాట్లాడటం రాబోయే ఎన్నికల్లో ఆయన పతనానికి నాంది అని పేదలకు మంచి చేయడం అంటే ఎన్నికల్లో నిలబడి గెలవని తన కొడుక్కి ఐటి శాఖ మంత్రి పదవి కట్టబెట్టినంత సులువు కాదని అందుకు పేదవారి బాధలు జగనన్న లా తెలుసుకోవాలని గత 40 ఏళ్ళలో పెత్తందారులు పక్షాన నిలిచిన చంద్ర బాబు కు పేదవారి కష్టాలు పట్టవని అందుకే అమరావతి పేదలు భూములు విషయంలో పెత్తందారులకి పెద్ద దిక్కు అయిన బాబు కి బుద్ధి చెప్పే రీతిలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని అది తట్టుకోలేక ఈరోజు బుడుగు బలహీన వర్గాల వారిని కించపరిచేలా మాట్లాడారని ఒకరిని పేదలను దూషిస్తే అధికారం లోకి రారని పేదలకు మంది చేసి వారి పక్షాన నిలబడితేనే వారు పట్టం కడతారని రాబోయే ఎన్నికల్లో పేద బడుగు బలహీన వర్గాల పక్షపాతి అయిన వైసిపి ప్రభుత్వం అధికారం లోకి రావడం ఖాయమని ప్రజలకు ఏమి కావాలో ఏమి చేస్తే బాగుంటుందో ఇప్పటికైనా ముందు బాబు తెలుసుకోవాలని అధికారం లేకపోయే సరికి తనకి తన బ్యాచ్ కి ఏమి చేయాలో పాలు పోక ఇలాంటి చవక బారు మాటలు ఆడుతున్నారని పేదలను దూషిస్తూ ఏదైతే మాట్లాడాలో ఆ మాటలు వెనక్కు తీసుకోవాలని లేదంటే ఈ నిరసనలు ఉధృతం చేస్తామని డిమాండ్ చేస్తూ మాట్లాడారు. ఈ నిరసన ర్యాలీ కార్యక్రమం లో ఆనందపురం మండలం వైసిపి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# భారతి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లో అరుదైన వైద్య చికిత్స...



పల్నాడు జిల్లా. నరసరావుపేట. మే 20 (ప్రజాపాలన ప్రతినిధి): పల్నాడు జిల్లా నరసరావుపేట లో భారతీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లో శుక్రవారం అరుదైన ఆపరేషన్ నిర్వహించడం జరిగింది. మాచర్ల పట్టణానికి చెందిన ఎనిమిది సంవత్సరాల సందీప్ అనే బాలుడి హార్సరుమ్ డిసిస్ అనే వ్యాధితో బాధపడుతు నరసరావుపేటలోని భారతి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యుల్ని సంప్రదించగా వైద్యులు గుంటూరు విజయవాడ లాంటి మహానగరాలకు వెళ్లే పని లేకుండా భారతీయ హాస్పిటల్ లో ఈ యొక్క అరుదైన చికిత్స నిర్వహించరు. ఈ సందర్భంగా భారతి హాస్పిటల్ వైద్యులు డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ... హార్సరుమ్ డిసిస్ బాధపడుతున్న సందీప్ అనే బాలుడు పుట్టిన నాలుగు నెలలు బాలుడికి మలం బయటికి వచ్చే ప్రాంతంలో నరాలు లేక 8 సంవత్సరాల వరకు వేరే రూపంలో మలం బయటికి వస్తున్న తరుణంలో వారి తల్లిదండ్రులు ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ అనిలా గారిని సంప్రదించగా వారు నరసరావుపేటలోని భారతి హాస్పిటల్ హాస్పిటల్ నాగేశ్వరావు ని సంప్రదించమని తెలియజేశారు. బాలుడు ని చూసి టెస్ట్ లు నిర్వహించి మేము ఆపరేషన్ చేయడానికి అన్ని వసతులు ఏర్పాటు చేసి ఆరోగ్యశ్రీ ద్వారా బాలుడికి డెహమేల్ ఫుల్ త్రు ఆపరేషన్ ని విజయవాడ ప్రముఖ వైద్యులు ద్వారా ఆపరేషన్ నిర్వహించమని తెలియజేశారు. ఈ యొక్క ఆపరేషన్ సహకరించిన వైద్యులకు మరియు మత్తు డాక్టర్లకు మరియు హాస్పిటల్ సిబ్బందికి మా యొక్క ధన్యవాదాలు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ హాస్పిటల్ వైద్యులు కే, నాగేశ్వరరావు కార్డియాలజిస్ట్ డా' గౌతం పాల్గొన్నారు.

## తూర్పు గోదావరి జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రజాహిత కార్యక్రమాలపై ప్రణాళికలు సిద్ధం చేయాలి: జిల్లా కలెక్టర్ డా కే. మాధవీలత



రాజమహేంద్రవరం: ప్రజాపాలన ప్రతినిధి: స్థానిక కలెక్టర్ ఛాంబర్ లో శనివారం ఉదయం రెడ్ క్రాస్ విభాగం జిల్లా సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వై. మధుసూధన్ ఆధ్వర్యంలో 2023-24 సంవత్సరమునకు చెందిన కార్యాచరణ పై కలెక్టర్ కి నివేదిక అందజేశారు. అనంతరం కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ తూర్పు గోదావరి జిల్లా ఏర్పడి ఏడాది పూర్తి అయిందని, జిల్లాలో రెడ్ క్రాస్ యూనిట్ ద్వారా మరిన్ని ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహిచాల్సిన అవస్యకత కలెక్టర్ గుర్తు చేశారు. విద్యార్థులు, స్వయం ఉపాధి రంగంలో, ఉపాధి హామీ కార్మికుల, ఉద్యోగాలు చేస్తున్న అర్హులను గుర్తించి వారికి మేకనైజ్డ్ మోటార్ సైకిళ్ళు దశల వారీగా పంపిణీ చేయాల్సి ఉంటుందని అన్నారు. అదేవిధంగా ట్రై సైకిల్స్, కృత్రిమ అవయవాలు (లింబ్స్) పంపిణీ చేయడం అత్యంత అవసరం అని పేర్కొన్నారు. రెడ్ క్రాస్ ద్వారా జిల్లాలో వినూత్న ఆలోచనలకు సృజనాత్మకత జోడించి అమలు చేయాలని కలెక్టర్ మాధవీలత ఆదేశించారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా శామ్ – మామ్ పిల్లల కోసం జిల్లాలో బంగారు కొండ అనే కార్యక్రమాన్ని రూపు దిద్దుతున్నామని మాధవీలత తెలిపారు. అదే తరహాలో గర్భిణీ స్త్రీల కోసం రెడ్ క్రాస్ ద్వారా రక్త హీనత ఎదుర్కొనే క్రమంలో అడుగులు వేయ్యాల్సి ఉంటుందని, ఆ దిశలో దాతల సహకారం ముఖ్యమని పేర్కొన్నారు. నేరుగా వ్యక్తిగత సంరక్షణ ద్రాతృత్వం లేదా నగదు రూపంలో దాతలు సహకారం తీసుకోవడం మంచిదన్నారు. ఆసక్తి గల వారిని భాగస్వామ్యం చెయ్యాలని పేర్కొన్నారు. టీబీ పేషంట్స్ దత్తత, సామాజిక చైతన్యం పై ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. జిల్లాలో బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చెయ్యడం కోసం తగిన ప్రతిపాదనలతో ముందుకు రావాలని సూచించారు. ఇప్పటికే అమలు జరుగుతున్న కార్యక్రమలతో కలిసి నిర్దుష్టమైన ప్రణాళిక తో కార్యాచరణ ముఖ్యమని పేర్కొన్నారు. ఇకపై నెలలో రెండు సార్లు రెడ్ క్రాస్ కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించాల్సి ఉంటుందన్నారు. యువత ను రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాలలో భాగస్వామ్యం చెయ్యడం తో, యోగ వంటి కార్యక్రమాలను , నైపుణ్యాభివృద్ధి తరగతుల ఆలోచన చేస్తున్నట్లు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ వై. మధుసూధన్ రెడ్డి తెలియచేశారు. ఆరోగ్యం, పరిశుభ్రత, ప్రకృతి విపత్తు నిర్వహణ, అగ్ని ప్రమాదాలు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో వై. మధుసూదన్ రెడ్డి తో పాటు ఏ నరేష్ కుమార్, పి. ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛంద సంస్థలు ఆధ్వర్యంలో ఒక లక్ష నలభై అయిదు వేల రూపాయలు ఆర్థిక సహాయం



భీమిలి ప్రజాపాలన ప్రతినిధి మే 20: విశాఖపట్టణం ఆనందపురం మండలం బోయిపలెం కు చెద్దిన స్వచంద సమస్త 10 రోజుల బాబు శ్రీకాకుళం జిల్లా ఏచర్ల మండలం, చిన్న కొంగ్రామ్ గ్రామనికి చెందిన ఢిల్లేశ్వర రావు అనే వక్తి చాలా పేద కుటుంబ రోజు వారి పనిగా వెల్డింగ్ షాపులోలి పనిచేసు కుంటు ఉండగాభార్య డెలివరీకి ఆరోగ్య శ్రీ ఉందని శ్రీకాకుళం జిల్లా కిమ్స్ హాస్పిటల్ లో అడ్మిట్ చేయగా వీరికి ఒక మగ పిల్లవాడు జన్మించి నాడు బాబు పుట్టినప్పటనుండి లిన్యూరో డిసార్డర్ లికనిపించటంతో హాస్పిటల్ సిబ్బంది వైద్యం కోసం విశాఖపట్నం జిల్లా కీ తీసుకొని వెళ్లామన్నారు. వెంటనే వారు విశాఖపట్నం జిల్లా అరీలోవ రెయిన్బో చిల్డ్రన్ హాస్పిటల్ లో జాయిన్లిలిచేశారు. హాస్పిటల్ యాజమాన్యం వారు వెంటనే ఒక లక్ష రూపాయలు కట్టమన్నరు వరి దగ్గరా అంత అమౌంట్ లేకపోవడంతో ఊరులో అప్పు చేసి ఒక లక్ష రూపాయలు కట్టారు ట్రీట్ మెంట్ కోసం ఇంకాఅమౌంట్ ఖర్చు అవుతోంది అని చెప్పడం తో అతనకి ఏం చేయాలో తెలియక సోషల్ మీడియాలో షేర్ చేయడం జరిగింది ఇది చూసిన కొన్ని స్వచ్ఛంద సంస్థలు హాస్పిటల్ కి వెళ్లి వలతో మాట్లాడి మేము ఉన్నాము అని ధైర్యం చెప్పి ప్రతి ఒక్కరి దగ్గర వలకు తోచినంత సహాయం చెయ్యాలి అని ఎన్జీవోస్ అందరూ కలిసి ఓ ఎస్ జి ఫౌండేషన్, మై బెస్తి టీమ్, జై జవాన్ ఫౌండేషన్, ఏ ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్, యరాడ హెల్పింగ్ హాండ్స్, భగత్ సింగ్ చారి ట్రబుల్ ట్రస్ట్, ఎన్ ఎస్ ఆర్ ఐటీ కాలేజ్, రీచ్ఇంగు హ్యాండ్స్, గివ్ బ్లడ్ సేవ్ లైఫ్, కశిం కోట కానిస్టేబుల్ వాసు వీరు అందరు కలసి ఒక లక్ష నలభై అయిదు వేల రూపాయలు అమౌంట్ అందించారు దీనిని ఉదేసించి ఓ యస్ జి ఫౌండేషన్ శివ మాట్లాడుతూ మానవత్వం ఉన్న అందరూ సోషల్ మీడియా లో బాబు పరిస్థితి చూసి అందరూ స్పందించి తమకు తోచిన సాయం ఫోన్ పే ద్వారా కలెక్ట్ చేయడం జరిగింది ఈ అమౌంట్ మొత్తం ఈ రోజు ఆరిలోవ రెయిన్బో చిల్డ్రన్స్ హాస్పిటల్ దగ్గరకి వెళ్లి ఆ పిల్లవాడి యొక్క తల్లిదండ్రులకు అమౌంట్ అందించడం జరిగింది అని తెలియ జేశారు, బాబు యొక్క తల్లిదండ్రులు ఇద్దరు ఈ స్వచ్ఛంద సంస్థలు అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు

## గ్రామదేవత ఏగలమ్మ తల్లి జాతర ప్రారంభించిన సర్పంచ్ అడబాల రామాంజనేయులు



జగ్గంపేట ప్రజాపాలన ప్రతినిధి : కాకినాడ జిల్లా జగ్గంపేట నియోజకవర్గం గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామంలో వెలసిన గ్రామ దేవత శ్రీ ఏగులమ్మ అమ్మవారి జాతర సర్పంచ్ అడబాల రామాంజనేయులు చేతుల మీదుగా కొబ్బరికాయ కొట్టి ప్రారంభించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో అడబాల రామాంజనేయులు మాట్లాడుతూ గ్రామమంతా సస్యశ్యామలంగా ఉండాలని, గ్రామస్తులంతా ఆయురారోగ్యాల తో ఉండాలని ప్రతి సంవత్సరం ఈ యొక్క జాతరను జరిగించడం జరుగుతుందని అలాగే ఏగులమ్మ జాతర సందర్భంగా నియోజవర్గంలో ఉన్న యువకులకు కబడ్డీ పోటీలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. ఈ యొక్క కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులుఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# కుమారదేవంలో వాలంటీర్లకి వందనం సన్మాన కార్యక్రమం



ప్రజాపాలన ప్రతినిధి కొవ్వూరు:తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామంలో ఈరోజు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వాలంటీర్లకి వందనం కార్యక్రమంలో భాగంగా వాలంటీర్లకి పంచాయతీ కార్యదర్శి మెసయ్యరాజు అధ్యక్షత న సన్మాన కార్యక్రమం జరిగింది,ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వర్యులు కష్టపడే వారికి ఎప్పుడూ సముచిత స్థానం కల్పించడం జరుగుతుంది అని అన్నారు,వాలంటీర్ ఒకరు సేవా వజ్ర అవార్డు,13 మందికి మిత్ర అవార్డులు అందుకున్నారు,అవార్డు తో పాటు సేవా వజ్ర గా జెట్టి ధనలక్ష్మి ఎన్నికయ్యారు, ఆమెకు అవార్డు, మరియూ 30000 రూపాయలు, మిత్ర అవార్డు గ్రహీత లకు 10000 రూపాయలు అందించారు. ఈకార్యక్రమానికి గ్రామ పంచాయతీ సర్పంచ్ కాసాని దుర్గ,యం.పి.టీ.సి యండపల్లి నటరాజారాణి ఉప సర్పంచ్ గద్దే రామకృష్ణ,గోలి శ్రీనివాస్, గోరిజాల పేర్రాజు, కోడూరి సత్యనారాయణ, నున్న నాగేశ్వరరావు,వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీస్,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

## సంపాదకీయం

**ఆదివారం 21, మే 2023**

## పెద్ద నోట్ల రద్దుతో నల్ల డబ్బు తెల్లగైంది.. సామాన్యుడి బతుకు చితికిపోయింది.. ఇప్పుడేం జరగనుందో !!

2016 నవంబర్ 8న దేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అట్టహాసంగా పెద్ద నోట్లను రద్దుచేసిన రోజు. ఆ తర్వాత సుమారు నెలన్నరకు పైగా, దేశంలోని జన సామాన్యం తమ రోజువారీ బతుకుల్లో సింహభాగం బ్యాంకుల ముందు క్యూలల్లో నిలబడిన కాలం అది. మోదీ నిర్ణయం-దేశంలోని నల్లడబ్బు దొంగలను కలుగులోనే పట్టుకునేందుకు అవసరమైనదిగా భావించి, అంతటి ఇబ్బందులను కూడా తట్టుకొని జనం ప్రభుత్వానికి సహకరించిన సందర్భం అది.ప్రస్తుతానికి ఇదంతా జరిగి ఆరేండ్లు దాటిపోయింది. వెనక్కు తిరిగి చూసుకుంటే..! నాడు ఆ పెద్దనోట్ల రద్దు కాలంలో వారానికీ 10 రోజులకు మారుతూపోయిన ఆ నోట్ల రద్దు తాలూకా కారణాలను ఒక్కొక్కటిగా నేడు మనం పరిశీలించుకుంటే కనపడేదేమిటి? మొదటగా నోట్ల రద్దు ఆరంభంలో మోదీ చెప్పిన కారణం నల్లడబ్బుకు చెక్ పెట్టడం. మరి ఇది ఎంతమేరకు జరిగింది? నాడు రద్దయిన పెద్ద నోట్లు అయిన వెయ్యి రూపాయలు, 500 రూపాయల తాలూకా మొత్తం విలువ రూ.15.41 లక్షల కోట్లుగా రిజర్వు బ్యాంకు గణాంకాలు చెప్పింది. పెద్ద నోట్ల రద్దు తర్వాత చాలా కాలానికి అటు ప్రతిపక్షాలు, ఇటు ప్రజల్లోని ప్రశ్నించే గళాలు నిలదీయగా, నిలదీయగా చివరికి రిజర్వు బ్యాంకు వెళ్లగక్కిన నిజం ప్రకారంగా రద్దయిన 15.41 లక్షల కోట్ల రూపాయల మొత్తంలో, బ్యాంకులకు తిరిగి కాస్త కూస్త తేడాతో అంతమొత్తమూ, అంటే 15.31 లక్షల కోట్ల రూపాయలు తిరిగి వచ్చేశాయి. అంటే పట్టుకున్న నల్ల డబ్బు, పట్టుమని రూ.10 వేల కోట్లు కూడా దాటలేదు. అదీ కథ. కొండను తవ్వి ఎలుకను పట్టిన కథ! అంతిమంగా ఈ మొత్తం కథలో ఫోర్బ్స్ అనే అంతర్జాతీయ పత్రిక చెప్పినట్లుగా ఈ పెద్దనోట్ల రద్దు కార్యక్రమం ప్రపంచంలోనే అతిపెద్ద మనీలాండరింగ్ స్కీంగా మిగిలిపోయిందనే సందేహం మాత్రం మనకు మిగిలేపోతుంది.ఇక ఈ పెద్దనోట్ల రద్దు సీరియల్ కథలో తర్వాత వచ్చి చేరిన కథనం పెద్దనోట్ల రద్దు అనేది, నగదు రహిత అంటే డిజిటల్ లావాదేవీలకు తెర తీయగలదనేది. అయితే కథనం తాలూకా ఈ భాగం ఎంతవరకూ వాస్తవరూపం ధరించింది? ఈ అంశంలో కాస్తంత వాస్తవ రూపం ధరించింది. అయితే అందులో కూడా అనేక అపస్వరాలు ఉన్నాయి. ఉదాహరణకు డిజిటల్ లావాదేవీలు గనుక పెరిగితే వాస్తవంలో కాగితపు కరెన్సీ చెలామణి తగ్గిపోవాలి. కానీ జరిగింది ఇదేనా? కాదు, నిజానికి 2016లో పెద్ద నోట్ల రద్దు జరిగిన రోజుకు నాలుగు రోజుల ముందర చెలామణిలో ఉన్న కాగితపు కరెన్సీ మొత్తం విలువ 17.74 లక్షల కోట్ల రూపాయలుగా ఉన్నది. కాగా, 2022 డిసెంబర్ 23 నాటికి రిజర్వ్ బ్యాంకు గణాంకాల ప్రకారం ఈ మొత్తం 32.42 లక్షల కోట్ల రూపాయలుగా ఉన్నది. అంటే, కాగితపు కరెన్సీ స్థానంలో డిజిటల్ కరెన్సీని ప్రవేశపెట్టే లక్ష్యం, పూర్తిగా వికటించి వాస్తవంలో కాగితం కరెన్సీ చెలామణి రెట్టింపయ్యింది. కాగా మరోపక్క మాత్రం యూపీఐ చెల్లింపులూ%ౌా% క్రెడిట్, డెబిట్ కార్డుల చెల్లింపులూ%ౌా% ఆన్‌లైన్ లావాదేవీల రూపంలో జరిగే లావాదేవీలు కూడా భారీగానే పెరిగాయి. అంటే%ౌా% ఈ అంశంలో అసలేం జరిగింది? మనం జాగ్రత్తగా గమనిస్తే, నాడు రద్దయిన 1000, 500 నోట్ల స్థానంలో వెలువడిన సరికొత్త 2000 రూపాయల నోట్లు నేడు సాధారణ చెలామణిలో కనబడటం లేదు. మరి ఆ నోట్లన్నీ ఏమైనట్లు? ఇక్కడే అసలు తతంగం ఉన్నది. పెద్దనోట్ల రద్దు పేరుతో వాటి స్థానంలో వచ్చిన ఈ మరింత పెద్దనోటు నేడు బడా బాబులు, అవినీతి రాజకీయనేతలూ, రియల్ ఎస్టేట్ వ్యాపారుల అవసరాల కోసం నల్లడబ్బుగా అండర్‌గ్రౌండ్‌కు వెళ్లిపోయింది. అంటే, పెరిగిపోయిన కాగితం కరెన్సీ చెలామణిలోని సింహభాగం నేడు 'పెద్ద మనుషుల' లావాదేవీల రూపంలో లెక్కలకు చిక్కకుండా తిరుగాడుతున్నది. కాగా, జన సామాన్యం చెల్లింపులూ, లావాదేవీలూ మాత్రం బహు పారదర్శకంగా నేడు డిజిటల్ ఎకానమీలో ప్రభుత్వ జీఎస్టీ ఆదాయపు రికార్డు స్థాయి పెరుగుదలలుగా నమోదవుతున్నది.ఇక తర్వాతిది, పెద్ద నోట్ల రద్దు అనేది తీవ్రవాదులకు నిధుల అందుబాటు లేకుండా చేసే మార్గంగా ముందుకువచ్చింది. కాగా, 2016 నవంబర్‌లో పెద్ద నోట్ల రద్దు జరిగిన తర్వాతే పుల్వామా తీవ్రవాద దాడి జరిగిన విషయాన్ని మనం మరువరాదు. అయితే 2018, 2019, 2020 సంవత్సరాల కాలంలో జమ్మూకశ్మీర్ లో తీవ్రవాద దాడుల సంఖ్య 614 (2018), 594 (2019), 244 (2020)లుగా తగ్గుతూ వచ్చిందనేది నిజం. అయితే దీనికి కారణం పెద్ద నోట్ల రద్దు వల్ల తీవ్రవాదులకు నిధుల అందుబాటు లేకపోవడం కాదు. ప్రభుత్వం తీవ్రవాదం పట్ల అనుసరించిన 'జీరో టాలరెన్స్' విధానంతో పాటుగా కాల్పుల నిలుపుదల ఒప్పందాల ఉల్లంఘనలూ, సరిహద్దుల ఆవల నుంచి కాల్పులు తదితర అంశాల్లో మన భద్రతా దళాలు వెనువెంటనే ప్రతిస్పందించి ఎదురుదాడి చేయడం వంటివన్నీ 2018-20ల కాలంలో తీవ్రవాదం తగ్గుదలకు కారణాలు. చివరగా.. పెద్ద నోట్లు రద్దయితే ఆ క్రమంలో దొంగనోట్లు కూడా ఏరివేయబడుతాయనే వాదన కూడా పసలేనిదిగానే తేలిపోయింది. నిజానికి నేడు అంటే పెద్ద నోట్లు రద్దు జరిగి సుమారు ఏడేండ్లు అవుతున్న క్రమంలో నకిలీ నోట్లు లేదా దొంగనోట్ల ఘటనలు పెరుగుతూనే ఉన్నాయి. మరి, ఈ పెద్దనోట్ల రద్దు మోదీ గారి పెద్ద వైఫల్యమా? అంటే, బహుశా కాదేమోననే అనిపిస్తున్నది. ఈ పెద్దనోట్ల రద్దు క్రమంలో జరిగిన అనేకానేక పరిణామాలు ఇటువంటి నిర్ధారణకు ఆస్కారం కల్పిస్తాయి. మించి, అసలు పెద్ద నోట్ల రద్దుకు ఏమైనా, అప్రకటిత రహస్య ఎజెండాలు కారణాలూ ఉన్నాయా? అనే సందేహమూ రాకపోదు! ఉదాహరణకు పెద్దనోట్ల రద్దు క్రమంలో ఒక పెద్ద బాధిత వర్గం చిన్న వ్యాపారులూ, పారిశ్రామికుల వర్గం అలాగే, రైతాంగం వంటి అసంఘటితరంగ ప్రజానీకం! పెద్దనోట్లు రద్దయి, ఆ క్రమంలో నగదుతో లావాదేవీలూ చేసే అవకాశం లేకుండా పోయినప్పుడు ఈ చిన్న వ్యాపారులూ, అసంఘటిత రంగంలోని వారూ తమ సరుకులనూ, సేవలనూ అమ్ముకోలేక అణగారిపోయారు. రోజువారీ అప్పులకూ, వడ్డీలకూ డబ్బు తెచ్చుకొని వ్యాపారాలు చేసుకొనే చిన్న చిన్న తోపుడుబండ్లూ, బుట్టల వ్యాపారస్తులు శాశ్వతంగా తమ ఉపాధిని కోల్పోయారు. అలాగే అనేకానేక మంది చిన్న పారిశ్రామికులు సైతం రోజువారీ ముడిసరుకు చెల్లింపులకో లేదా వేతనాల చెల్లింపులకో నగదు అందుబాటు లేక బోర్డులు తిప్పేశారు. ఈ క్రమంలోనే, వీరు కోల్పోయిన అమ్మకాలు లేదా లావాదేవీల అవకాశాలు డిజిటల్ లావాదేవీలు అంటే క్రెడిట్, డెబిట్ కార్డులూ అలాగే ఆన్‌లైన్ లావాదేవీలకు సదుపాయాలు అప్పటికే ఉన్న పెద్ద వ్యాపారసంస్థలూ మాల్స్‌కు అదనపు అమ్మకాలు, లావాదేవీలుగా జమయ్యాయి. అంటే, పెద్దనోట్ల రద్దు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కాకులను కొట్టి గద్దలకు వేసేదిగా పరిణమించింది.దేశ ప్రజల పెట్టుబడుల లేదా మదుపుల ప్రాధాన్యాలను కూడా ఈ పెద్దనోట్ల రద్దు మార్చే ప్రయత్నం చేసింది. ఉదాహరణకు నాడు పెద్ద నోట్ల రద్దు ప్రకటించబడిన వెంటనే దేశంలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. కాగా, భారతీయులు తమ పెట్టుబడుల పరం గా భౌతిక సంపత్తి వైపు అంటే రియల్ ఎస్టేట్ కొనుగోళ్లూ లేదా బంగారం కొనుగోళ్ల వైపు మొగ్గు చూపుతారనేది అందరికీ తెలిసిందే.

# ఉద్యమ నిర్మాతగా సుందరయ్య వారసత్వాన్ని కొనసాగిద్దాం



సుందరయ్య దృష్టిలో కేంద్రీకృత ప్రజాస్వామ్యం ప్రాతిపదికగా నడిచే క్రమశిక్షణాయుతమైన పార్టీ అన్నిటికన్నా కీలకం. వర్గ పోరాటాలు ప్రజా పోరాటాలు పెంపొందించడం, కార్మిక కర్షక ఐక్యత, పాలక వర్గాలకు వ్యతిరేకంగా పోరాటం, బూర్జువా భూస్వామ్య రాజ్యం శ్రామికవర్గంపై సాగించే నిర్బంధానికి వ్యతిరేకంగా పోరాడటం ఇవన్నీ కూడా ఆ విధమైన క్రమశిక్షణ గల పార్టీపైనే ఆధారపడి వుంటాయి. 1964 నుంచి 1976 వరకూ ఆయన సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన పన్నెండేళ్ల కాలంలో ఈ లక్ష్య సాధనకే ఆయన కృషి చేశారు. సరైన మార్క్సిస్టు,లెనినిస్టు మూలసూత్రాల ప్రాతిపదికన అలాంటి పార్టీ నిర్మాణం కోసం మనం సుందరయ్య వారసత్వాన్ని ముందుకు తీసుకుపోవాలి.మన దేశ కమ్యూనిస్టు ఉద్యమ ప్రసిద్ధ నేతల్లో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఒకరు. ఉద్యమానికి ఆయన అందించిన అనేకానేక సేవలలో రెండు ప్రధానమైనవి. దీర్ఘకాలం నిలిచి వుండేవి. అందులో ఒకటి పార్టీ నిర్మాణంలో ఆయన నిర్వహించిన పాత్ర. గ్రామసీమలలో వ్యావసాయిక సమస్య పట్ల ఆయన రూపొందించిన మార్క్సిస్టు దృక్పథం.విప్లవాత్మక పార్టీ నిర్మాణంలో ఆయన పాత్ర గురించి ఈ వ్యాసంలో నేను దృష్టి కేంద్రీకరిస్తాను. తాను 1930లో కమ్యూనిస్టునయ్యానని సుందరయ్య స్వయంగా చెప్పుకున్నారు. దక్షిణ భారత దేశంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం కోసం నియోగించబడిన అమీర్ హైదర్ ఖాన్ అరెస్టు తర్వాత ఆయన నిర్మాణ దక్షత బాగా ప్రస్ఫుటమైంది. యువ సుందరయ్య పార్టీ ఆర్గనైజర్‌గా 1934లో బాధ్యతలలో ప్రవేశించారు. అప్పుడాయన వయస్సు 22. అవిభక్త కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కేంద్ర కమిటీలో ఆయన సభ్యుడయ్యారు. మీరట్ కుట్ర కేసు ఖైదీల విడుదల తర్వాత దేశంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం కోసం ఏర్పడిన తొలి సంఘటిత వేదిక అదే.
కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాల ప్రాతిపదికన కమ్యూనిస్టు పార్టీని నిర్మించవలసిన అవసరాన్ని తొలిగా గుర్తించిన వారిలో సుందరయ్య ఒకరు. అలాగే పార్టీకి ఒక అఖిల భారత కేంద్రం వుండాలనీ ఆయన అర్థం చేసుకున్నారు. సుందరయ్య లోని ఈ విశిష్టతను కామ్రేడ్ బి.టి రణదివే ఆయన అంతిమ యాత్ర సభలో గొప్పగా చెప్పారు. "పార్టీ మూల సూత్రాల కోసం పోరాటం, మరే అంశం కన్నా పార్టీయే సర్వోన్నత్యం కోసం పోరాటం, పార్టీ విప్లవ క్రమశిక్షణ కోసం పోరాటం ఇవే కామ్రేడ్ సుందరయ్య చేసిన పోరాటాలు. ఇవే ఆయనను పార్టీలో అత్యున్నత నాయకుడుగా నిలిపాయి." కమ్యూనిస్టు పార్టీ నిర్మాణ స్వరూపంలో కీలకమైన అంశం కేంద్రీకృత ప్రజాస్వామ్యం. ఈ ప్రాతిపదికపై పోరాటమే కామ్రేడ్ సుందరయ్య, కామ్రేడ్ బసవపున్నయ్య తదితరులు భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) నిర్మించేలా చేశాయి. సైద్ధాంతిక రాజకీయ నిర్మాణ రంగాలలో రివిజనిస్టు సూత్రాలపై పోరాటానికి నడిపించాయి.

**కేంద్రీకృత ప్రజాస్వామ్యం విశిష్టత**

పార్టీ నిర్మాణంలో కర్తవ్యాలు పేరిట 1967లో రూపొందిన పత్రాన్ని కామ్రేడ్ సుందరయ్య, కామ్రేడ్ బసవపున్నయ్యలు రాశారు. పార్టీలో కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడం ఈ పత్రం ఉద్దేశం.కేంద్రీకృత ప్రజాస్వామ్యం అంటే ఏమిటో ఆ పత్రం ఇలా వివరించింది: మన పార్టీలో పై కమిటీలు పార్టీ సభ్యులతో ఎన్నుకోబడతాయి గనక వారి విశ్వాసం పొందినవారై వుంటారు. అందువల్లనే వారికి పార్టీ వ్యవహారాలు నిర్వహించడానికి అవసరమైన సాధికారత లభిస్తుంది. వ్యక్తి సంస్థ పట్ల విధేయత కలిగి వుండటం, మైనారిటీగా వున్నవారు మెజారిటీకి లోబడి వుండటం, దిగువ కమిటీ పై కమిటీకి లోబడి వుండటం, అన్ని భాగస్వామ్య వ్యవస్థలూ కేంద్ర కమిటీకి లోబడి వుండటం జరగాలి. కేంద్రీకృత అనేది ప్రజాస్వామ్యం నుంచి వేరుగా వుండదు. ఆ ప్రజాస్వామ్యమే దాని ప్రాతిపదికగా వుంటుంది.'మన పార్టీలో ప్రజాస్వామ్యం అంటే పార్టీ సమావేశాలు జరపడం, సరైన నాయకత్వంలో వాటిని నిర్వహించడం, అవసరమైన సన్నాహాలతో సావధాన చర్చలతో తీర్మానాలు ఆమోదించడం, జాగ్రత్తగా ప్రతిపాదనలు తయారు చేసిన తర్వాత ఎన్నికలు నిర్వహించడం. మా పార్టీలో ప్రజాస్వామ్యం అంటే నాయకత్వం లేని ప్రజాస్వామ్యం కాదు, కుహనా ప్రజాస్వామ్యం గానీ పార్టీలో అరాచకం గానీ కాదు.'''పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యాన్ని ఉన్నత ప్రమాణాలకు తీసుకు వస్తేనే ఆ ప్రాతిపదికన పార్టీ నాయకత్వంలో ఉన్నత స్థాయి కేంద్రీకృత నాయకత్వాన్ని సాధించగలం'.
సుందరయ్య దృష్టిలో కేంద్రీకృత ప్రజాస్వామ్యం ప్రాతిపదికగా నడిచే క్రమశిక్షణాయుతమైన పార్టీ అన్నిటికన్నా కీలకం. వర్గ పోరాటాలు ప్రజా పోరాటాలు పెంపొందించడం, కార్మిక కర్షక ఐక్యత, పాలక వర్గాలకు వ్యతిరేకంగా పోరాటం, బూర్జువా భూస్వామ్య రాజ్యం శ్రామికవర్గంపై సాగించే నిర్బంధానికి వ్యతిరేకంగా పోరాడటం ఇవన్నీ కూడా ఆ విధమైన క్రమశిక్షణ గల పార్టీపైనే ఆధారపడి వుంటాయి. 1964 నుంచి 1976 వరకూ ఆయన సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన పన్నెండేళ్ల కాలంలో ఈ లక్ష్య సాధనకే ఆయన కృషి చేశారు. సరైన మార్క్సిస్టు, లెనినిస్టు మూలసూత్రాల ప్రాతిపదికన అలాంటి పార్టీ నిర్మాణం కోసం మనం సుందరయ్య వారసత్వాన్ని ముందుకు తీసుకుపోవాలి.

**దిద్దుకోవలసిన అంశాలు**

కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాల ప్రాతిపదికన పార్టీ నిర్మాణాన్ని, పని విధానాన్ని పటిష్టం చేసుకోవడం అవసరం. సమిష్టి పని విధానం వ్యక్తిగత బాధ్యత, విమర్శ, ఆత్మ విమర్శ పద్ధతిలో పార్టీ కృషిని వ్యక్తిగత కృషిని సమీక్షించుకోవడం అవసరం. పార్టీ శాఖలలో స్వేచ్ఛగా నిర్మొహమాటంగా చర్చల ద్వారా పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యాన్ని అమలు చేయాలి. మెజార్టీ అభిప్రాయాన్ని కమిటీ అభిప్రాయంగా అమలు చేయడం మైనార్టీ అభిప్రాయాన్ని కూడా పార్టీ వేదికలలో వినిపించే అవకాశం వుండేలా హామీ కల్పించడం జరగాలి. పార్టీ కేంద్ర కమిటీ జూన్ నుంచి ఆగష్టు మధ్య కాలంలో దిద్దుబాటు కార్యక్రమాన్ని అమలు చేయాలని పిలుపునిచ్చింది. పార్టీ కమిటీల పని పద్ధతులు తీరు కూడా దిద్దుబాటు అంశాల్లో భాగంగా వున్నాయి. కమిటీలు కేంద్రీకృత ప్రజాస్వామ్య పద్ధతిలో పని చేయిస్తున్నామా లేదా అనేది మనం పరీక్షించుకోవాలి. కేంద్రీకృత ప్రజాస్వామ్య పద్ధతి నుంచి వైదొలగడం, ఉల్లంఘించడం ఏమైనా జరిగిందా అని నిశితంగా పరిశీలించి తప్పులను ఎత్తిచూపాలి. పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యం అంటే పార్టీ కామ్రేడ్స్ ఎవరైనా భిన్నాభిప్రాయం వుంటే పార్టీ వేదికలలో వాటిని వెలిబుచ్చేందుకు హక్కు కలిగివుంటారు. అందుకు ఎలాంటి ఆటంకాలు వుండకూడదు. భిన్నాభిప్రాయాలను తొక్కిపట్టే ప్రయత్నం అనుమతించకూడదు. కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాన్ని అన్వయించడం అంటే ఒకసారి నిర్ణయం తీసుకున్నాక మెజార్టీ అభిప్రాయం సమిష్టి నిర్ణయం అవుతుంది. వ్యక్తిగత అభిప్రాయాలు లేదా మైనార్టీ అభిప్రాయం గలవారు కూడా దాన్ని ఆమోదించి అమలు చేయాలి. మైనార్టీ అభిప్రాయాన్ని బేఖాతరు చేయడం గానీ పార్టీ వెలుపల వ్యక్తిగత అభిప్రాయాలు లేదా మైనార్టీ అభిప్రాయం అమలుకు ప్రయత్నించడం కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధం. ఇది ముఠాతత్వానికి లేదా గ్రూపులు కట్టడానికి దారితీస్తుంది. అదే సమయంలో నిరంకుశాధికార పద్ధతులు గానీ, వ్యక్తిగత అభిప్రాయాల లేదా మైనార్టీ అభిప్రాయాలను తొక్కిపట్టడానికి ప్రయత్నించడం కూడా కేంద్రీకృత ప్రజాస్వామ్య పద్ధతులకు వ్యతిరేకమే. పార్టీ నిబంధనావళిలో పొందుపర్చబడిన కేంద్రీకృత ప్రజాస్వామ్యం అన్ని కోణాలనూ అమలు చేసేవిధంగా కమిటీలు పనిచేస్తున్నాయా అనే విషయాన్ని అన్ని కమిటీలు సమీక్షించవలసి వుంటుంది.వ్యక్తిగత ధోరణి, స్వీయ మానసిక ధోరణి, నిరంకుశాధికార పోకడలు, ఉదారవాదం కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాల ఉల్లంఘనకు మూల కారణాలుగా వస్తున్నాయని నిర్మాణంపై కోల్‌కతా ప్లీనం నిర్దిష్టంగా ఎత్తిచూపింది. సమీక్షలో అలాంటివి వున్నాయని గుర్తిస్తే వాటిని దిద్దుకోవడానికి చర్యలు చేపట్టాలి. పార్టీ పనికి వచ్చే కార్యకర్తలను గుర్తించడం వారిని తీర్చిదిద్దడం అనే మరో గొప్ప లక్షణం సుందరయ్యలో వుండేది. తొలి రోజుల్లో ఆయన ఆంధ్ర తెలంగాణలలో పార్టీ శాఖలు స్థాపించడం మొదలుపెట్టినప్పుడు తర్వాత తను పార్టీ కేంద్రంలో ఆర్గనైజర్‌గా బాధ్యతలు అప్పగించబడినప్పుడు ఈ లక్షణం ప్రస్ఫుటమైంది.

**క్యాడర్ విధానం కీలకం**

1967 నిర్మాణ రంగంలో మన కర్తవ్యాలు అనే సిద్ధాంత పత్రం ఆయన ప్రధాన కార్యదర్శిగా వున్నప్పుడే ఆమోదించబడింది. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో కార్యకర్తల పట్ల సరైన క్యాడర్ విధానం రూపొందించుకోవడంలో వైఫల్యాన్ని ఆ పత్రం సూటిగా పేర్కొంది. మార్క్సిజం, లెనినిజంకే అంకితమైన క్యాడర్ లేకుండా ఒక కమ్యూనిస్టుపార్టీ గాని విప్లవోద్యమం గాని నిర్మించడం సాధ్యం కాదు. ఇందుకోసం భవిష్యత్తులో ఉపయోగపడే పార్టీ కార్యకర్తలను గుర్తించాలి. వివిధ తరగతుల ప్రజలలో పని చేసేందుకు అవసరమైన విధంగా వారిని అభివృద్ధి చేసి శిక్షణ ఇవ్వాలి. పూర్తికాలం కార్యకర్తల, వారి కుటుంబాల కనీస అవసరాలకు తగువిధంగా పార్టీ ఏర్పాట్లు చేయాలి. దురదృష్టవశాత్తూ మనం ఈనాటి అవసరాలకు తగినట్టుగా ఈ క్యాడర్ విధానం అమలుపర్చలేకపోతున్నాం. మన పూర్తికాలం కార్యకర్తలు వివిధ స్థాయిల్లో రాజకీయ నిర్మాణ వ్యవహారాల నాయకులుగా వుండాలి. కాని మన లోపభూయిష్టమైన దృష్టి కోణం కారణంగా చాలామంది కార్యకర్తలు కేవలం పని చేసే (ఉద్యోగస్తులుగా) వారిగా మిగిలిపోతున్నారు. నాయకత్వ స్థాయి కార్యకర్తలకు అవసరమైన రాజకీయ, సైద్ధాంతిక స్థాయి లేకుండా పోతున్నది. అందువల్ల పార్టీ నిర్మాతగా సుందరయ్య పని విధానం నుంచి నేర్చుకోవలసిన ఒక అతి ముఖ్యమైన పాఠం పార్టీ క్యాడర్‌ను పెంపొందించడం, తీర్చిదిద్దడం. ఆయన వేసిన బాటలో ముందుకు సాగుదాం. సిపిఐ(ఎం)ను, కమ్యూనిస్టు ఉద్యమాన్ని శక్తివంతం చేసి ముందుకు నడిపించేందుకు మనం చేసే పోరాటంలో మనం సుందరయ్య అందించిన ఈ మహత్తర వారసత్వాన్ని కొనసాగించేందుకు దీక్షబూనుదాం.

## కొండనాల్క పెరిగింది

మేం ఉదయాన్నే కాఫీ తాగుతాం
ప్రపంచ బ్యాంకు అప్పు పుచ్చుకున్నంత
ఆనందంగా
మేం ప్రభాతనడక కూడ చేస్తాం
రింగ్ రోడ్డు చుట్టూ చెమట పట్టేంత
వరకూ
స్నానం గురించిన చింత చీమంతైనా
లేదు
ఇన్ని ప్రాజెక్టుల శంకుస్థాపనల సాక్షిగా..
విపక్షాలది వొట్టి లొల్లి కేళే గాని
సానుకూల దృక్పథం కోల్పోయిన
ప్రగతివాదులు వీళ్ళు
కాంట్రాక్టులన్నాక కొన్ని
మర్యాదలుంటాయి
ఇంటల్లుడి గౌరవానికి లోటు రాకూడదు
మేనమామ హక్కులకి భంగం
వాటిల్లరాదు
కన్నాం కాబట్టి పిల్లల్ని గూర్చి
ఆలోచించాల్సిందే
కాదన్నదెవరు..?
ప్రజాస్వామ్యం అంటే పంచుకోవడమే
కదా-
భూములైనా కాంట్రాక్టులయినా
కొల్లగొట్టే చౌరస్తాలయినా
ఎంతకీ ఎర్రగడ్డల రాజకీయాలేనా-
చర్చించడానికి సమస్యలు చాల వున్నాయి
గోదావరి కొత్తపాయ పారుతుంది
ఆలస్యమైన ప్రాజెక్ట్ కుండకు చిల్లిపడింది
సామూహిక శత్రువు కొండనాల్క పెరిగింది
తోకపట్టి వెనక్కి లాగితే ఏం
ప్రయోజనం..?
ఆర్థికమండళ్ళు వెల్లివిరిస్తేనే కదా
స్విస్ బ్యాంకులో శ్రీమహాలక్ష్మి విప్లవ
తాండవం..!

**- డాక్టర్ పెరుగు రామకష్ణ**

## మోకరిల్లిన క్షణాలు

మనం ఫ్రాంజ్ కాఫ్కా యొక్క దు్ఃఖం
నీషే తత్వం
దోస్తోవ్ స్కీ అన్వేషణ
ఎమిల్ సియోరాన్ అమరత్వం
ఆల్బర్ట్ కామూ యొక్క మానవత
మరియు కార్ల్ మార్క్స్ యొక్క కల

ఇంకా అజ్ఞాత కవి రాసిన విషాద రాతలం
మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న
సంగీతకారుడి విషాదపు గీతాలం
వణుకుతున్న చేతితో వాన్ గోగ్ గీసిన
గీతలం మనందరం
గాంధీ చెప్పినట్టు చెంపదెబ్బలు
తింటున్నవాళ్ళం
సందుల్లో విషాదపు గోడలం
భయంతోనూ, ఒత్తిడితోను ఉన్న ప్రతి
ఒక్కరు
సరదాగా గడిపినవాళ్ళ ఉపన్యాసాలలో
చివరి వరుసలో కూర్చొని
మన ఉనికిని గుర్తించేవాళ్ళం
మనం రాత్రికి స్నేహితులం
బాధలు, నిజాలు ఎవరికీ
తెలియనివ్వనివాళ్ళం
సినిమాలో విషాదకరమైన సన్నివేశం చూసి
ఏడ్చేవాళ్ళం

ఒంట్లో నెత్తురు తక్కువైనవాళ్ళం
మనకేం కావాలో కూడా తెలియని ప్రాచీన
మెదడులం
ఇంకా స్థిరపడలేకపోతున్నాం!
మనం ఐక్యత గురించి తెలిసిన
అంబేద్కర్ రచనల్లో మాత్రమే కలుసుకునే
ఒంటరివాళ్ళం!

**- శాంతయోగి యోగానంద**

## ప్రధాని నరేంద్ర మోడీజీ అత్యంత సాహసోపేతమైన నిర్ణయం శుభపరిణామమే

### ఆర్బీఐ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించిన..బీజేపీ నేత గంధ్రోతు వీరగోవిందరావు



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, ప్రజాపాలన ప్రతినిధి: రావులపాలెం,:రెండు వేల నోట్ల నిలిపివేత సాహసోపేతమైన నిర్ణయమని ఎన్నికల ఇంకా కేవలం ఒక సంవత్సరంలోపు సమయమే ఉన్న కూడా ప్రధాని మోడీ మరోసారి సంచలన నిర్ణయం తీసుకున్నారని బీజేపీ నేత గంధ్రోతు వీరగోవిందరావు అన్నారు మోడీజీకి రాజకీయ భవిష్యత్తు కన్నా దేశ హితమే ముఖ్యమని మరోసారి రుజువు చేశారన్నారు2 వేల రూపాయల నోట్లను చలామణి నుంచి ఉపసంహరించుకోవాలని శుక్రవారం నాడు ఆర్బీఐ ప్రకటించి తీసుకున్న నిర్ణయాన్ని ఆయన స్వాగతించారు ఈ సందర్భంగా గంధ్రోతు వీరగోవిందరావు మాట్లాడుతూ పెద్ద నోట్లు నిలిపివేత నిర్ణయం వలన మంచి ఆర్థిక వ్యవస్థకు నాంది పలకడంతో పాటుగా దేశం కోసం జనం మేలు కోసం చిత్తశుద్ధితో పనిచేసే నరేంద్రమోదీ నిజాయితీపరుల ప్రయత్నాలకు అత్యంత బలాన్ని చేకూరుస్తాయన్నారు బలమైన నేత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అద్భుతమైన నిర్ణయం దేశ భవిష్యత్తుకు దేశప్రగతికి మంచి శుభపరిణామన్నారు గతంలో 2016లో నోట్లు రద్దు వలన సామాన్య ప్రజలు కొన్ని ఇబ్బందులు పడినది వాస్తవమని ఇప్పుడు ఆ పరిస్థితులు ఉండవన్నారు 500.1000 నోట్లు రద్దుతో నాడు దేశీయ అవశరాలను తీర్చేందుకు ఈ రెండు వేల నోటును అందుబాటులోకి తెచ్చారన్నారు కాలక్రమేనా సరిపడా ఇతర కొత్త నోట్లు అందుబాటులోకి వచ్చాక ఆర్బీఐ 2018-19లోనే 2వేల నోట్లు ముద్రణను ఆపేసిందన్నారు పెద్ద నోటు ఉపసంరించుకునే విషయంలో ప్రతిపక్షాలన్నీ కలిసిగట్టుగా మోడీ మీద వ్యతిరేక ప్రచారం చేస్తాయని తెలిసినప్పటికీ ప్రధాని నరేంద్ర మోడీ ఈ నిర్ణయం తీసుకోవడం అత్యంత సాహసోపేతమైన విషయమని గంధ్రోతు అన్నారు బీజేపీపై ప్రధాని మోడీపై ఎవరు ఎన్ని విమర్శలు చేసిన దేశ అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. అవినీతి మాఫియా అక్రమాదారులు పోగేసుకునే నల్లధనానికి చెక్ పెట్టేందుకు ఇది సరైన నిర్ణయమన్నారు

## ఎమ్మెల్యే మల్లాది విష్ణు చేతులమీదుగా రూ.17 లక్షల అభివృద్ధి పనులకు భూమిపూజ



ఎన్టీఆర్ జిల్లా ప్రజాపాలన ప్రతినిధి: విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలుకల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. 24వ డివిజన్ తరిమిల నాగిరెడ్డి వీధిలో రూ. 17 లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ కుక్కల అనితతో కలిసి శనివారం ఆయన భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ.. ప్రజల కనీస అవసరాలను తీర్చడంలో గత చంద్రబాబు ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని విమర్శించారు. తెలుగుదేశం ప్రభుత్వం పోతుపోతూ పెద్దఎత్తున సమస్యలు వదిలివెళ్లిందని..వాటన్నింటినీ సవాలుగాతీసుకుని ప్రతి ఒక్క ప్రాంతాన్ని ఈ ప్రభుత్వం అభివృద్ధి పరుస్తున్నట్లు వెల్లడించారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో ఈ ప్రాంతంలో పెనుమార్పు వచ్చిందని వెల్లడించారు. ప్రజలకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా.. సెంట్రల్ ను అభివృద్ధిలో మేటిగా నిలిపడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు మల్లాది విష్ణు తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## చిట్వేలి మానవత ఆధ్వర్యంలో పుట్టినరోజు సందర్భంగా ఆహార పొట్లాలు పంపిణీ



అన్నమయ్య జిల్లా :ప్రజాపాలన ప్రతినిధి: చిట్వేలి మండల కేంద్రంలోని మైలపల్లి పంచాయతీ ఎం గొల్లపల్లి గ్రామస్తులు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పంది కాళ్లమని పెద్ద కుమారుడు వెంకటరమణ, ఇండియన్ ఆర్మీ ఢిల్లీ వారి కుమారుడు స్టాలిన్ మూడవ జన్మదినం సందర్భంగా చిట్వేలి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పేదలకు పారిశుద్ధ్య కార్మికులకు అనాధలకు స్వీట్లు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం కమిటీ సభ్యులు పందికాల మనీ కుటుంబ సభ్యులు మానవతా చైర్మన్ చౌడవరం సురేంద్ర రెడ్డి, అధ్యక్షులు కుంభగిరి రావు, ఇంతియాజ్ అహ్మద్,నరసింహ నాయుడు, ఆంధ్రయ్య, నాగయ్య,తదితరులు పాల్గొన్నారు

# దళితులంటే ఇంత చిన్న చూపా..?

### దివ్యాంగురాలిని కార్యాలయానికి రమ్మని ఎందుకు అన్నారు.?
### గంగమ్మ ఇంటికెళ్లి ఎందుకు సాయం చేశారు
### నాగలక్ష్మి కి అలాగే ఇంటి వద్ద సాయం చేయొచ్చు కదా
### అంబటి పై మరోసారి నోరు జారితే ఆంజనేయులు
### నీ ఇంటి కొచ్చి కాళ్ళు నరుకుతాం
### హెచ్చరించిన దళిత సంఘాల నేతలు



సత్తెనపల్లి, ప్రజాపాలన ప్రతినిధి: పల్లపు గంగమ్మకు ఇంటి వద్దకు వెళ్లి సాయం చేసి, దివ్యాంగురాలు అయిన నాగలక్ష్మి ని మీ పార్టీ కార్యాలయానికి ఎందుకు రమ్మన్నారు..? అంబటిని విమర్శించిన వారిపై అభిమానం, వికలాంగురాలిపై చిన్న చూపా, దళితులంటే ఇంతటి వివక్ష ప్రదర్శిస్తారా? మానవత్వంతో సాయం చేసిన మంత్రి అంబటి పై మరోసారి నోరు జారితే నీ ఇంటి కొచ్చి కాళ్ళు నరుకుతాం ఆంజనేయులు అంటూ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, ఎస్సీ సెల్ పల్నాడు జిల్లా అధ్యక్షులు జైపాల్ లు జివి పై నిప్పులు చెరిగారు. శనివారం పార్టీ కార్యాలయంలో వినుకొండ మాజీ శాసనసభ్యులు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు ...,రాష్ట్ర జలవనరుల శాఖామాత్యులు అంబటి రాంబాబు పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.సందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు మాట ఇచ్చి విస్మరించి , హామీ ఇచ్చి నిలబెట్టుకోలేకపోతే.. సానుభూతితో దివ్యాంగురాలు నాగలక్ష్మి కి సాయం చేయటానికి మంత్రి అంబటి రాంబాబు ముందుకు వచ్చారు. మాట ఇచ్చి నిలబెట్టుకోలేని మీరు,, దళితులకు ద్రోహం చేసిన మీరు ..సాయం చేసిన మమ్మల్ని,, మానవత్వం చూపిన అంబటి ని నాలుక కోస్తా అంటావా జీవీ ఆంజనేయులు.. నువ్వు కొయ్యటానికి సత్తెనపల్లి రావాలి. వేము కొయ్యాలి అనుకుంటే వినుకొండలో నువ్వు చేసిన లేకి పనులకు నీ పక్కనే ఉన్న వాళ్ళతోనే నీ నాలుక కోయించగలమని . ఈ ..సాయం చేయాలనే ఆలోచన, మానవత్వం మీ కుంటే నాగలక్ష్మి ఇంటి వద్దకే ట్రై సైకిల్, నగదు తీసుకొచ్చి అప్పజెప్పాలి అంతేగాని కార్యాలయానికి రమ్మని వికలాంగురాలిని వేధించడం ఏంటి.? ఇదెట్ల సాయం అవుతుందన్నారు.మాట ఇవ్వటం, నిలబెట్టుకోవడం చంద్రబాబు సిద్ధాంతంలో ఎక్కడైనా ఉందా.? , వెన్నుపోటు తప్ప సాయం మాటమీద నిలబడటం చంద్రబాబు రక్తంలోనే లేదని దుయ్యబట్టారు.. ఎస్సీలుగా పుట్టాలని ఎవరు అనుకుంటారని ఎవరు అన్నారో గుర్తులేదా ఆంజనేయులు అని ప్రశ్నించారు. దళితులకు రాజకీయాలు ఎందుకురా పిచ్చి ముండాకొడుకుల్లారని కూసింది మీకు గుర్తులేదా జీవి అని నిలదీశారు.ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వలేదని దళిత మహిళను వివస్త్రను చేసి హింసించడం గురించి మర్చిపోయావా వినుకొండ ఆంజనేయులు అంటూ మండిపడ్డారు. ఇంకొకసారి మా అంబటి గారిపై ఇలాంటి పిచ్చి ప్రేలాపాలను పేలితే.. నీ కొండ పగిలిపోతుంది వినుకొండ ఆంజనేయులని హెచ్చరించారు. పాత్రికేయుల సమావేశంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు యాసారపు బాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు కోడి రెక్క దేవదాసు, జూపల్లి పాల్ సర్పంచులు అనిల్, వేమవరపు బుల్లిబాబు, నందిగం యల్లమంద సంకటి సాంసన్, కోటేశ్వరరావు, పార్టీ అనబద్ధ సంఘాల నాయకులు ప్రజాప్రతితులు ఉన్నారు

## రైలు నం. 12862 మహబూబ్‌నగర్ - విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ ను జెండా ఊపి ప్రారంభించిన కేంద్ర మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి



మహబూబ్‌నగర్, ప్రజాపాలన ప్రతినిధి: కేంద్ర సాంస్కృతిక , పర్యాటకం మరియు ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, 20 మే 2023 వ తేదీన మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్ నుండి రైలు నం. 12862 మహబూబ్‌నగర్ – విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ రైలును జెండా ఊపి ప్రారంభించారు . రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్, స్పోర్ట్స్ యూత్ సర్వీసెస్ మరియు ఆర్కియాలజీ మంత్రి గౌరవ శ్రీ .వి శ్రీనివాస్ గౌడ్ మహబూబ్ నగర్ ఎంపీ గౌరవ శ్రీ ఎం. శ్రీనివాస్ రెడ్డి, మహబూబ్ నగర్ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గౌరవ శ్రీమతి స్వర్ణ సుధాకర్ రెడ్డి, మహబూబ్ నగర్ మున్సిపల్ చైర్మన్ గౌరవ శ్రీ కె .సి నర్సింలు : డివిజినల్ రైల్వే మేనేజర్ శ్రీ శరత్ చంద్రయాన్, మరియు ఇతర సీనియర్ రైల్వే అధికారులు మరియు ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు . ఈ సందర్భంగా శ్రీ జి. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, కొత్తగా మహబూబ్‌నగర్–విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ పాలమూరు ప్రాంత ప్రజలను నేరుగా కాచిగూడతో పాటు కాజీపేట, వరంగల్, విజయవాడ, ఏలూరు, సామర్లకోట, దువ్వాడ తదితర ముఖ్యమైన నగరాలను కలుపుతుందని అన్నారు. ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే కనెక్టివిటీ అది రోడ్‌వేలు అయినా లేదా రైల్వేలైనా చాలా ముఖ్యం.



రైల్వే మౌలిక సదుపాయాలు, విద్యుదీకరణ, ప్రయాణీకుల సౌకర్యాల సదుపాయం మరియు మెరుగైన రైలు కనెక్టివిటీ పరంగా ఇటీవలి సంవత్సరాలలో తెలంగాణ ప్రాంతంలో రైలు అభివృద్ధి వేగంగా జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. కనెక్టివిటీని మెరుగుపరిచే దిశగా కేంద్రం సికింద్రాబాద్, మహబూబ్‌నగర్‌ల డబ్లింగ్ కోసం రూ. 1400 కోట్లు వెచ్చించిందని అని ఆయన చెప్పారు. తెలంగాణ ప్రాంత సర్వతోముఖాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని, అన్ని విధాలా కృషి చేస్తామని ఆయన తెలిపారు. మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో త్వరలో ఉచిత వై-ఫై సౌకర్యం కల్పిస్తామని శ్రీ జి. కిషన్ రెడ్డి తెలియజేసారు. అలాగే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను రూ. 720 కోట్లతో పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు . ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా రైల్వే స్టేషన్‌ను విమానాశ్రయాలతో సమానంగా ఆధునిక సౌకర్యాలు, సౌకర్యాలతో అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్‌లలోని ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాన్ని అందించేలా చర్లపల్లిలో శాటిలైట్ టెర్మినల్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రైలు నం. 12861/12862 విశాఖపట్నం – కాచిగూడ – విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌ను మహబూబ్‌నగర్ వరకు పొడిగించడం వల్ల ఈ ప్రాంత ప్రజలు నేరుగా వరంగల్, ఖమ్మం, రాయనపాడు (విజయవాడ), ఏలూరు, రాజమండ్రి, అన్నవరం, విశాఖపట్నం వరకు వెళ్లేందుకు మార్గం సుగమమైందని అన్నారు .ఈ రైలు మహబూబ్‌నగర్ మరియు విశాఖపట్నం రెండు స్టేషనలనుండి సౌకర్యవంతమైన రాత్రి ప్రయాణ సౌలభ్యాన్ని అందిస్తుంది. ప్రయాణికులు ఉదయం వేళల్లో సౌకర్యవంతంగా వారి గమ్యస్థానాలకు చేరుకోవడానికి వీలు కల్పిస్తుంది. ఈ రైలు %ాజ% 2 టైర్, %ాజ% 3 టైర్, స్లీపర్ క్లాస్ మరియు జనరల్ కోచ్‌లతో కూడిన రిజర్వ్‌డ్ మరియు అన్‌రిజర్వ్డ్ సెగ్మెంట్ ప్రయాణికుల అవసరాలను కూడా తీర్చనుంది .



## 46వ డివిజన్లో విస్తృతంగా పర్యటించి వ్యర్ధాలను రోడ్డు మీద పడేయద్దు అని స్థానికులకు చెప్పిన వెల్లంపల్లి

ఎన్టీఆర్ జిల్లా ప్రజాపాలన ప్రతినిధి: విజయవాడ పశ్చిమ నియోజకవర్గం విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి 46 వ డివిజన్లో. పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు విస్తృతంగా పర్యటించి డివిజన్ లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నగర పాలక సంస్థ నిర్వహిస్తున్న త్రిబుల్ అర్ కార్యక్రమాన్నిప్రారంభించారు.ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ సుమారు 10కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు.కె ఎల్ రావు పార్క్ ను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.రోడ్లు అభివృద్ధిచేస్తున్నామన్నారు.డివిజన్ లో జరుగుతున్న పనులను పరిశీలించరన్నారు.డివిజన్ లో నూతన వాటర్ ట్యాంకు నిర్మించబోతున్నట్లు తెలిపారు.అభివృద్ధికి కృషి చేయడంజరుగుతుందన్నారు.ఈ డివిజన్ ను మోడల్ డివిజన్ గా అభివృద్ధి చేస్తామని అన్నారు.దేశంలో నే మన విజయవాడ నగరనికి మంచి ర్యాంకు వచ్చిందన్నారు.ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నా అధికారులకు అభినందనలు తెలిపారు.ప్రతి ఒక్కరూ కూడా ఈ త్రిబుల్ కార్యక్రమాన్నివినియోగించాలని పిలుపునిచ్చారు.వ్యర్థాలను రోడ్డు మీద పడేయద్దు విజ్ఞప్తి చేశారు.ఇళ్లలలో పనికి రాని వస్తువులను తృబుల్ అర్

## చలివేంద్రం ఏర్పాటు



సత్తెనపల్లి ప్రజాపాలన ప్రతినిధి: సబ్ రిజిస్టర్ వారి కార్యాలయం ఎదురుగా డొక్కా సీతమ్మ గారి మంచినీటి చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగినది ఈ విక్రమాన్ని స్థానిక నాయకులు సత్తెనపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు శ్రీ బొర్రా వెంకట అప్పారావు గారి చేతుల మీద ఈ కార్యక్రమాన్ని ఈరోజు ఎంత అట్టహాసంగా ప్రారంభించడం జరిగినదిఈ కార్యక్రమం ప్రారంభించి అందరికీ మంచినీరు మజ్జిగ పెరుగు అన్నం పంపిణీ చేశారు ఈ సందర్భంగా బొర్రా గారు మాట్లాడుతూ ఎండ్ల తీవ్రతతో ప్రజలు మరింత దాహార్థి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గాడిచిన వారం నుండి ఎండలు విపరీతంగా ఉన్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని అవసరమైతే తప్పితే బయటికి రావద్దని వచ్చిన తగు జాగ్రత్తలు తీసుకొని రావాలని ప్రభుత్వం ప్రజలకు ఎండ ఇబ్బందులు కలగకుండా కొన్ని షెల్టర్లు మంచినీటి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు

## నగరి మండల జనరల్ బాడీ సమావేశంలో పాల్గొన్న మంత్రి ఆర్.కె.రోజా



చిత్తూరు జిల్లా ప్రజాపాలన ప్రతినిధి: :రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక వ్యవహారాల, యువజన సర్వీసుల మరియు క్రీడా శాఖ మంత్రి శ్రీమతి ఆర్.కె.రోజా శనివారం నగరి మండలం జనరల్ బాడీ సమావేశంలో పాల్గొని, ప్రసంగించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి నగరి మండలంలోని గడపగడపలో మంజూరైన అభివృద్ధి పనులన్నీ కంప్లీట్ చేయమని అధికారులకి ఆదేశాలు ఇవ్వడం జరిగింది. హౌసింగ్ సంబంధించిన మండలంలో మిగిలిన వర్కులన్నీ కూడా పూర్తి చేయమని ఆదేశాలు ఇచ్చారు.అదేవిధంగా ఎండ తీవ్రత ఎక్కువ ఉందని, గ్రామాలలో ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా చూసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు, వడగాలులు వీస్తునందున అన్ని ప్రభుత్వ హాస్పిటల్లో పరికరాలు, మెడిసిన్స్ అందుబాటులో ఉండాలని ఏమైనా అవసరమైతే చెబితే ఇమ్మీడియేట్గా నా రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా తెప్పిస్తామని చెప్పడం జరిగింది.నగరి మండల జనరల్ బాడీ సమావేశంలో ఎంపీపీ, వైస్ ఎంపీపీ లు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు, మండల. అధికారులు పాల్గొన్నారు.

# ఆటోను ఢీకొన్న వాటర్ వాన్



నూజివీడు, మే 20, ప్రజాపాలన ప్రతినిధి: నూజివీడు పట్టణ పరిధిలోని శ్రీనివాస మహల్ సెంటర్ సమీపంలో పశువుల ఆసుపత్రి వద్ద శనివారం ట్రిపుల్ ఐటీ కి కార్మికులను తరలిస్తున్న ఆటోను ఎదురుగా వేగంతో వస్తున్న మినరల్ వాటర్ వాన్ ఢీకొన్న సంఘటన. ఈ ప్రమాదంలో పట్టణానికి చెందిన ట్రిపుల్ ఐటీ హౌస్ కీపింగ్ కార్మికులు వీరమ్మ(50), అంజలి(38) లకు తీవ్రమైన గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రధమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య సేవలకు క్షతగాత్రులను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం ట్రిపుల్ ఐటీ కార్మిక వర్గాలలో తీవ్ర భయాందోళనలు గురిచేసింది. ఈ సంఘటనతో పట్టణంలోని ప్రధాన రహదారుల వెంబడి వచ్చిపోయే వాహనాల వేగాన్ని అధికారులు నియంత్రించాలని కోరారు. ఇందుకోసం రెవెన్యూ, మున్సిపల్, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది ప్రత్యేక బృందంగా ఏర్పడి కార్యాచరణ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ ప్రమాదానికి సంబంధించి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో వైసీపీ నాయకుడు అంబటి వెంకటేశ్వరరావు



పొన్నూరు మే20( ప్రజా పాలన ప్రతినిధి) పొన్నూరు పట్టణం అంబేద్కర్ సెంటర్లో ఎమ్మెల్యే కిలారి రోశయ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో వైయస్సార్ పార్టీ నాయకుడు శ్రీ వెంకటేశ్వర భవన్ అధినేత అంబటి వెంకటేశ్వరరావు శనివారం పాల్గొని ప్రయాణికులకు, పాదాచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం అంబటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఏడాది అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా ఎమ్మెల్యే కిలారి రోశయ్య తన సొంత ఖర్చులతో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ప్రయాణికులకు వేసవి తాపం తీర్చేందుకు ఉచిత మజ్జిగ శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో తాను పాల్గొనటం గర్వనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## వ్యాయామంతో క్రమశిక్షణ గల జీవితం




నూజివీడు, మే 20, ప్రజాపాలన ప్రతినిధి: నూజివీడు పట్టణంలోని ఎస్ఆర్ఆర్ బాలుర హై స్కూల్ ఆవరణలో గల ప్రథమశ్రేణి శాఖ గ్రంథాలయంలో కొనసాగుతున్న సమ్మర్ క్యాంపు వేసవి శిక్షణ తరగతులలో శనివారం వ్యాయామం పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యోగా గురువు విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఆసనాలు, వ్యాయామం ప్రతి ఒక్కరి జీవితాన్ని క్రమశిక్షణతో ముందుకు తీసుకు వెళుతుందన్నారు. సూర్యోదయానికి ముందే నిద్ర లేవడం, కాల కృత్యాలు తీర్చుకొని, నిత్యం వ్యాయామం, ఆసనాలతోపాటు, నడక ఎంతో ఆరోగ్యాన్ని అందిస్తుందన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని చెప్పిన పెద్దల మాట అక్షరసత్యంగా ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగొందాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ లేని జీవితం నిరార్ధకంగా మిగులుతుంది అన్నారు. విద్యార్థి దశ నుండి క్రమశిక్షణతో ముందడుగు వేస్తే జీవితం బంగారు భవితకు బాటలు వేస్తుందని సోదాహరణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ బిహెచ్ శ్రీనివాస్, సిబ్బంది నాగలక్ష్మి, యశ్వంత్, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠకులు పాల్గొన్నారు.

## నేడు నూజివీడులో విద్యుత్ సరఫరాలో అంతరాయం



నూజివీడు, మే 20, ప్రజాపాలన ప్రతినిధి: నూజివీడు పట్టణంలో 33 కె.వి సబ్ –స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా ఆదివారం ఉదయం 7 నుండి9 గంటల మధ్య విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడు తుందని ఏపీసిఎ డీసీఎల్ ఈఈ కృష్ణ నాయక్ తెలిపారు. నూజివీడులో ఆయన శనివారం మాట్లాడుతూ తిరువూరు రోడ్, పెద్ద గాంధీబొమ్మ, చిన్న గాంధీ బొమ్మ , బ్యాంకు స్ట్రీట్, ఎంప్లాయిస్ కాలనీ, పొట్టిశ్రీరాములు బొమ్మ , జంక్షన్ రోడ్, ఆర్ఆర్ పేట, ఆటోనగర్, శ్రీ ధర్మశాస్త అయ్యప్పస్వామి వారి ఆలయం, అమ్మవారి తోట, తుమ్మల వారి వీధి, మొఘల్ చెరువు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

# పేద ప్రజలకు ఇచ్చే ఇళ్ల స్థలాలను స్మశానంతో పోల్చడం బాధాకరం



పల్నాడు జిల్లా. నరసరావుపేట .మే 20 ( ప్రజా పాలన ప్రతినిధి.): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాజధాని అమరావతి ప్రాంతంలో పేద వర్గాల నివాసానికి స్థలం కేటాయిస్తుంటే ప్రతిపక్ష నాయకుడు నారా చంద్రబాబునాయుడు పేద వర్గాలకు కేటాయించిన స్థలాలను స్మశానంతో పోల్చడం అనేది చాలా బాధాకరమైన విషయమని పల్నాడు జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ మెంబెర్ కోటా సుబ్బు మాదిగ అన్నారు. చంద్రబాబు నాయుడు రాజధాని అమరావతిలో పేదలకు స్థలాలు ఇవ్వటానికి వీల్లేదు అనే మాట మాట్లాడటం ఆయన కుల అహంకారానికి నిదర్శనమని, రాజధాని ప్రాంతంలో పేదవాడికి గూడు ఏర్పాటు చేయాలని మహా గొప్ప యాగానికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కి ధన్యవాదాలు అదేవిధంగా చంద్రబాబు నాయుడు పరిపాలన కాలంలో పేదవాడికి సెంటు భూమ్ ఇవ్వలేని చరిత్ర చంద్రబాబు ది అని నీరు చెట్టు అనే పథకాన్ని తీసుకొచ్చి పేద వర్గాలు సాగు చేసుకున్న భూములను కాచేసిన చరిత్ర చంద్రబాబు నాయుడుది అని అన్నారు. అదే కాలంలో ఎస్సీల్లో పుట్టాలని ఎవరు కోరుకుంటారు అనే ఎన్నో రకాలుగా దళితులను ఇబ్బంది పెట్టిన చరిత్ర చంద్రబాబు కె దక్కుతుంది అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో పెత్తందారులకు పేదవాడికి జరుగుతున్న యుద్ధంలో పేదవాడు తో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రయాణం కొనసాగిస్తుంటే, అదే పెత్తందారులు అడ్డం పెట్టుకొని నారా చంద్రబాబునాయుడు పేద వర్గాలను అణిచివేసే ప్రయత్నం చేస్తున్నాడు చంద్రబాబు లోకేష్ భవిష్యత్తులో దళితుల పట్ల వివక్ష ను విడకపోతే 2019లో ఏ పరిస్థితి లు అయితే ఎదుర్కొన్నారో అదే పరిస్థితి 2024 లో అదే పునరావతం అవుతుంది అని సుబ్బు మాదిగ అన్నారు. పేదల మనసులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్థానం సంపాదించుకున్నారని 2024 లో కూడా మళ్లీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దే విజయమని పల్నాడు జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ మెంబర్ కోట సుబ్బు మాదిగ అన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలలో ప్రైవేటు కన్నా మెరుగైన సౌకర్యాలు....



ప్రజాపాలన న్యూస్. శ్రీకాళహస్తి :ప్రగతి సంస్థ, తిరుపతి వారి ఆద్వర్యంలో ఏర్పేడు మండలం లోని అంజిమేడు మరియు పోతుమానుగుంట గ్రామాలలోని బడి ఈడు పిల్లల తల్లి తండ్రులను కలసి ప్రభుత్వ పాఠశాలల్లో వారి పిల్లలను చేర్చవలసినదిగా కోరడం జరిగినది. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలలో నాడు నేడు, జగనన్న విద్యా కానుక, జగనన్న వసతి దీవెన తదితర కార్యక్రమాల ద్వారా మెరుగైన విద్యను మరియు మౌళిక సౌకర్యాల కల్పన ప్రభుత్వం కల్పించడం జరుగుతోంది, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని తల్లి తండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్చవలేనన్న ఉద్దేశ్యాలతో ప్రగతి సంస్థ ఆద్వర్యంలో ఏర్పేడు మండలంలోని గ్రామాలలో తల్లి తండ్రులకు అవగాహన కల్పించడం జరుగుచున్నది. ఈ కార్యక్రమాలలో పాల్గొన్న ప్రగతి మండల కోఆర్డినేటర్ శిరీష మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతో పాటు విద్యాభివృద్ధి కొరకు ఉచిత బోజనం, బట్టలు, పుస్తకములతో పాటు మౌళిఖ వసతుల కల్పనకు అనేక కార్యక్రమాలను ప్రభుత్వం వారు చేపట్టం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ బడులను బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమాలలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఈశ్వర్ రావు, తల్లి తండ్రుల కమిటీ సభ్యురాలు మాదవి, సచివాలయం సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులతో పాటు ప్రగతి సిబ్బంది శివారెడ్డి మరియు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## భూమి రక్షించుకోవడం మనందరి బాధ్యత :డి ఏ ఓ నున్న వెంకటేశ్వర్లు



పొన్నూరు మే20( ప్రజా పాలన ప్రతినిధి) :పొన్నూరు మండలం తాళ్లపాలెం గ్రామం సంగమేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో శనివారం పొన్నూరు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఖరీఫ్ శిక్షణా కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ వ్యవసాయ వ్యర్థాలను తగలబెట్టకుండా భూమిలో కలియబెట్టి భూసారాన్ని పెంచుట అనే విషయంపై శిక్షణ కార్యక్రమం రైతులకు వివరించారు. రబీ పంట జొన్న, మొక్కజొన్న వ్యవసాయ వ్యర్థాలను తగుల పెట్టకుండా భూమిలో కలియబెట్టి భూసారాన్ని పెంచాలని ఇందుకు అవసరమైన కన్సర్షియ ఏ మరియు బి అనే శిలీంద్రం మరియు బ్యాక్టీరియాలను వానపాముల ఎరువు లేదా పశువుల ఎరువు లతో కలిపి వ్యవసాయ వ్యర్థాలను మల్చర్ తో చిన్న చిన్న ముక్కలుగా చేసుకొని పైన కలిపిన మిక్చర్ ను పొలం పైన పిచికారి చేయాలని తెలిపారు. ఇందుకు నేలలో తేమ ఉండేటట్టుగా చూసుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియ వలన దీనివల్ల వ్యవసాయ వ్యర్థాలు అన్నీ కూడా కుళ్ళి భూమికి సేంద్రియ ఎరువు గా చేర్చబడుతుందని వివరించారు. కార్యక్రమంలో ఏడిఏ సిహెచ్ తిరుమల దేవి మాట్లాడుతూ వ్యర్థాలు కాల్చడం వలన వాతావరణ సమతుల్యత లోపిస్తుందని భూమిలో సూక్ష్మ జీవుల తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం టీపిడి పి. రామాంజనేయుల, ఏవో రాజవంసి, గుంటూరు కృషి విజ్ఞాన కేంద్రం నుండి ఎమ్. గంగాదేవి( సైంటిస్ట్), పొన్నూరు ఏ డి ఏ సిహెచ్ తిరుమల దేవి, పొన్నూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ఆకుల వెంకటేశ్వరరావు, మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు ఎం పద్మలీల, తాళ్లపాలెం సర్పంచ్ వీరయ్య, ఆరెమండ సర్పంచ్ అప్పారావు, స్థానిక ఏఓ వెంకట్రామయ్య, ఆర్ బి కే సిబ్బంది , తాళ్లపాలెం, కట్టెంపూడి, దండమూడి, ఆరమండ గ్రామాల రైతులుపాల్గొన్నారు. తదుపరి డీకంపోజర్ ను ఒక ఎకరానికి సరిపడే విధంగా ఎలా తయారు చేసుకోవాలో రైతులకు తెలియజేశారు. అనంతరం క్షేత్ర సందర్శన నిర్వహించి పొలంలో మల్చర్ తో వ్యవసాయ వ్యర్థాలను ఎలా చిన్న చిన్న ముక్కలుగా చేసుకోవచ్చు రైతులకు చూపించారు. రైతులందరూ రాబోవు రోజుల్లో ఈ పద్ధతిని పాటించి భూమిలో సేంద్రీయ కర్బనం పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలనిరైతులకు తెలియజేశారు.

## పల్నాడు జిల్లా కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షుడు అలెగ్జాండర్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి వర్ధంతి



పల్నాడు జిల్లా. నరసరావుపేట. మే 20 (ప్రజాపాలన ప్రతినిధి): నరసరావుపేట (పలనాడు) జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డిసిసి అధ్యక్షుడు అలెగ్జాండర్ సుధాకర్ అధ్వర్యంలో పార్టీ నాయకులు కార్యకర్తలు కలసి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం కాసు బ్రహ్మానందరెడ్డి వర్ధంతి దినోత్సవాన్ని ఘనంగాగా నిర్వహించారు. ఈ సదర్భంగా అలెగ్జాండర్ మాట్లాడుతూ కాసు బ్రహ్మానందరెడ్డి కేంద్ర, రాష్ట్రాల్లో మంత్రి పదవులతో పాటు అనేక పార్టీ పదవులను నిర్వహించాడు. 1955 లో ఆంధ్ర రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ఫిరంగిపురం నియోజక వర్గం నుండి ఎన్నికై, ఆ తరువాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభలోనూ సభ్యుడిగా కొనసాగాడు. కాంగ్రెసు పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు, 1956 లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత ఆంధ్ర రాష్ట్ర శాసన సభ్యులంతా ఆంధ్రప్రదేశ్ లోనూ సభ్యులుగా కొనసాగారు. ఆ విధంగా బ్రహ్మానందరెడ్డి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో సభ్యుడై, నీలం సంజీవరెడ్డి మంత్రి వర్గంలో పురపాలన శాఖ మంత్రిగా చేరాడు. ఆ తరువాత దామోదరం సంజీవయ్య మంత్రి వర్గంలో వాణిజ్య శాఖ, ఆర్థిక శాఖలు నిర్వహించాడు. ఆర్థిక శాఖను అతడు అత్యంత సమర్ధవంతంగా నిర్వహించాడు. 1964 వ సంవత్సరం ఫిబ్రవరి 29 న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసాడు, కేంద్రమంత్రి వర్గంలో 1974 వ సంవత్సరంలో బాధ్యతలు చేపట్టి, కమ్యూనికేషన్, హోం, పరిశ్రమల శాఖలను నిర్వహించాడు. అలాంటి గొప్ప నాయకుడు మన నరసరావుపేట వాసి అగుట మన నరసరావుపేట అదృష్టమని వ్యాఖ్యానించారు. ఆయన తలపై టోపీని అటూ ఇటూ మార్చితే అమోఘ మైన రాజకీయ ఎత్తు వేసినట్టే అనే పేరు ఉండేది. అని కార్యకర్తలకు బ్రంహానందరెడ్డి నాయకత్వ లక్షణాలను తెలిపి వారి లక్షణాలను కార్యకర్తలు నాయకులు కూడా అలవర్చు కోవాలని కోరారు . ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు భాష, కృష్ణ యూత్ కాంగ్రెస్ నాయకులు నాగేంద్ర,రమేష్,సత్యం, జాకీర్,పి రమేష్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

# సృజనాత్మకతను అభివృద్ధి చేయడానికి వేసవి వినోదం సహకరిస్తుంది: రోటేరియన్ పి.వి.సుబ్బారావు



కాకినాడ , ప్రజా పాలన ప్రతినిధి : విద్యార్థులలో సృజనాత్మకతను అభివృద్ధి చేయడానికి వేసవి వినోదం సహకరిస్తుందని రోటరీ క్లబ్, ప్రాధమిక విద్య, అక్షరాస్యత కమిటి ఛైర్మన్ పి.వి.సుబ్బారావు అన్నారు. స్థానిక జగన్నాధపురం ఎమ్.ఎస్.ఎన్ చారిటిస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల నందు వి.బి.వి ఆర్. ఛారిటబుల్ ఫౌండేషన్ అధ్యర్యంలో నిర్వహించచమస్తున్న వేసవి వినోదం 5వ రోజు కార్యక్రమం శనివారం నిర్వహించారు. విద్యార్థులకు ఓరిగమిపై శిక్షణను ఇవ్వడం జరిగింది. రిసోర్స్ పర్సన్స్ గా పి.విజయలక్ష్మి, జి.శ్యామలా కుమారి వ్యవహరించారు. పిల్లలతో కాగితాలతో బొమ్మలు చేయడాన్ని వివరించి వారితో చేయించారు. విద్యార్థులు చాలా ఉత్సాహంగా వివిధ బోమ్మలు తయారు చేసారు. ఓరిగమి వలన పిల్లలలో సృజనాత్మకత పెరుగుతుంది. వారిలో ఆలోచనా శక్తి అభివృద్ధి అవుతుంది. వృధాగా ఉన్న కాగితాలతో బొమ్మలు చేయడం వలన పర్యావరణ పరిరక్షణ కు అవకాశం ఉంటుంది. బాలవేదిక కన్వీనర్ నోరి బలరామకృష్ణ పాటలు పాడటం నేర్పించారు.

## మా సంఘం భూములను మాకు అప్పగించండి

**ఆర్డీఓకు విన్నవించిన జమాతుల్ ఖురేష్ సంఘం సభ్యులు**




రాజమహేంద్రవరం: ప్రజాపాలన ప్రతినిధి: ఆక్రమణకు గురవుతున్న తమ సంఘం భూములకు రక్షణ కల్పించి తమకు అప్పగించాలని జమాతుల్ ఖురేష్ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆర్డీఓను కలిసి వినతి పత్రం అందచేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రెసిడెంట్ అబ్దుల్ వాహెద్, సెక్రటరీ అబ్దుల్ పహీమ్, హామీదుల్లా తదితరులు మీడియాతో మాట్లాడారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేట గ్రామ పంచాయతీ పరిధిలో 2.40 ఎకరాలు భూమి ఉండగా సర్వే నెంబర్ 1095/3లో 91 సెంట్ల భూమికి అధికారులు తప్పుడు పత్రాలు సృష్టించి సయ్యద్ ఫయాజ్ ఉద్దీన్ పేరిట మార్చి ఫారమ్ 1బి ఇచ్చారని ఆరోపించారు. ఎటువంటి ఆధారాలు లేకుండా పత్రాలు మార్చి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. సదరు రికార్డులను రద్దు చేయాలని జిల్లా కలెక్టర్ వారికి అర్జీ పెట్టగా ఆర్డీఓ వారిని నివేదిక ఇవ్వాలని కోరినట్టు వివరించారు. తమ సంఘానికి చెందిన భూమిని ఎటువంటి ఆధారాలు లేకుండా తప్పుడు పత్రాలు సృష్టించిన అధికారులు, తమ భూములను కాజేయాలని చూసిన వారిపై తక్షణం చర్యలు తీసుకుని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే తమ జమాతుల్ ఖురేష్ సంఘం భూములకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ అమానుల్లా, మహ్మద్ ఫైజుల్లా, అధిక సంఖ్యలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## మహిళా మల్ల యోధులు లైంగిక వేధింపుల కేసులో ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్ పై పోక్సో చట్టం కింద చర్యలు తీసుకోవాలి



పల్నాడు జిల్లా. నరసరావుపేట. మే 20 (ప్రజా పాలన ప్రతినిధి.): మహిళా మల్ల యోధులు లైంగిక వేధింపుల కేసులో ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్ పై పోక్సో చట్టం కింద చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య పల్నాడు జిల్లా కన్వీనర్ సిహెచ్ నిర్మల ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది శనివారం పల్నాడు జిల్లా కార్యాలయంలో డిఆర్ఓ వినాయకం కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా మహిళా కన్వీనర్ సిహెచ్ నిర్మల మాట్లాడుతూ రెజ్లింగ్ భారత ఒలింపిక్ అసోసియేషన్ వారి అనుబంధంగా ఉన్న ఇతర ప్రభుత్వ ఏజెన్సీలకు ఎంపీపై ఫిర్యాదులు చేశారని కానీ అధికారులు అతనిపై చర్యలు తీసుకోలేదని అన్నారు. మహిళా మల్ల యోధులు చేసిన ఫిర్యాదులను పట్టించుకోకపోవడంతో వాటిని ప్రజల్లోకి తీసుకు రావలసి వచ్చిందని అన్నారు .జనవరి 18న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తమ బహిరంగ నిరసన ప్రారంభించారు కానీ కొన్ని రోజులు తర్వాత న్యాయం జరుగుతుందని సంబంధిత అధికారుల హామీ మేరకు వారిని ఉపసంహరించారని అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఢిల్లీ పోలీసులు ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణసింగుపై రెండో ఎఫ్ఐఆర్లు ఒకటి ఫోక్సో కింద మరొకటి పోస్ట్ చట్టం క్రింద దాఖలు చేశారని తెలిపారు ఎంపీని తక్షణమే అరెస్ట్ చేయాలని పార్లమెంటు సభ్యునిగా ఉన్న అతని సస్పెండ్ చేయాలని మల్ల యోధుల సంఘం అధ్యక్ష పదవి నుండి తొలగించి అతనిపై వచ్చిన ఫిర్యాదులపై న్యాయ విచారణ జరిపించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మహిళా మల్ల యాధులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ , ఏ ఐ వై ఎఫ్ అండ్ ఏ ఐ ఎస్ ఎఫ్ కమిటీ వారు, సిపిఐ పట్టణ కార్యదర్శి వైదన్ వెంకట్ పట్టణ మహిళా టౌన్ సెక్రెటరీ ఎస్ దేవి ఎం గురువారెడ్డి బి లలిత కుమారి కాసా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



# ఆదిపురుష్ కోసం జై శ్రీరామ్ ర్యాలీ



యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ హీరో గా ఓం రౌత్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ఆదిపురుష్. రామాయణం కథ ఆధారంగా తెరకెక్కిన ఈ మూవీ రిలీజ్ కి రెడీ అవుతోంది. జూన్ 16న ప్రపంచ వ్యాప్తంగా ఐదు భాషల లో రిలీజ్ కానుంది. ఇప్పటికే ఈ మూవీ ప్రమోషన్స్ గట్టిగా జరుగుతున్నాయి. ప్రేక్షకుల ముందుకి వచ్చిన ఆదిపురుష్ ట్రైలర్ విశేషంగా ఆకట్టుకుంది. ఇప్పుడు ఈ మూవీ నుంచి నెక్స్ట్ సాంగ్స్ కి ప్రేక్షకులకి అందించే ప్రయత్నం చేస్తున్నారు. ఆదిపురుష్ నుంచి జై శ్రీరామ్ సాంగ్ ని ఈ రోజు సాయంత్రం ఐదు గంటలకి లాంచ్ చేయనున్నారు. ఈ సాంగ్ లాంచింగ్ సందర్భంగా డార్లింగ్ ప్రభాస్ ఫ్యాన్స్ వినూత్న ప్రమోషనల్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇండస్ట్రీలో ఇప్పటి వరకు ఏ సినిమాకి చేయని విధంగా బైక్ ర్యాలీతో జై శ్రీరామ్ జెండాలు పట్టుకొని పట్టణాలలో పెద్ద ఎత్తున ర్యాలీకి సిద్ధమయ్యారు. రెండు తెలుగు రాష్ట్రాలలో ఆదిపురుష్ సినిమాకి మరింత హైప్ తీసుకొచ్చే ప్రమోషన్ లో భాగంగా డైరెక్ట్ గా ఫ్యాన్స్ రంగంలోకి దిగడం విశేషం. ఇక భారీగా ప్రతి సిటీలో శని ఆదివారాలలో బైక్ ర్యాలీకి ప్రభాస్ డై హార్ట్ ఫ్యాన్స్ పిలుపునిచ్చారు. తెలంగాణ లో నిజామాబాద్ వరంగల్ హైదరాబాద్ సిటీస్ లో ఈ బ్యాక్ ర్యాలీ జరగనుంది. అలాగే తిరుపతి శ్రీకాకుళం జిల్లాలలో ఈ బైక్ ర్యాలీని భారీ ఎత్తున నిర్వహించడానికి రెడీ అయ్యారు. ఇంకా మరికొన్ని సిటీస్ లో కూడా జరగనుంది అని ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ క్లారిటీ ఇవ్వడం విశేషం. ఈ బైక్ ర్యాలీలో జై శ్రీరామ్ జెండాలు పట్టుకొని స్లొగన్స్ తో ఫ్యాన్స్ సందడి చేయనున్నారు. మొత్తానికి ఆదిపురుష్ ప్రమోషన్స్ కోసం ప్రభాస్ ఫ్యాన్స్ డైరెక్ట్ గా రంగంలోకి దిగి సినిమాకి ఊపు తీసుకొచ్చే ప్రయత్నం చేయడం విశేషం. జూన్ 11న ఈ మూవీ ప్రీరిలీజ్ ఈవెంట్ ని తిరుపతిలో గ్రాండ్ గా నిర్వహించనున్నారు. ఇక జూన్ 13న స్పెషల్ ప్రీమియర్స్ షోలు వేయాలని అనుకున్న ముందుగా రిలీజ్ అయితే మరల ఇబ్బంది అవుతుందని భావించి వాటిని చిత్ర యూనిట్ క్యాన్సిల్ చేసింది. డైరెక్ట్ గా జూన్ 16న మిడ్ నైట్ షోలతో సినిమా బిగ్ స్క్రీన్స్ పై సందడి చేయనుంది.

# సుడిగాలి సుధీర్ నెక్స్ట్ మూవీ టైటిల్ ఫిక్స్




యువ నటుడు సుడిగాలి సుధీర్ ప్రస్తుతం అటు బుల్లితెర పై అలానే ఇటు సినిమాల్లో మంచి క్రేజ్ తో దూసుకెళ్తున్నారు. ఇటీవల ఆయన నటించిన గాలోడు సినిమా మంచి విజయం అందుకుంది. మరోవైపు కాలింగ్ సహస్ర మూవీ రిలీజ్ కి రెడీ అవుతోంది. ఇక తాజాగా నరేష్ కుప్పిలి దర్శకత్వంలో ఒక మూవీ అనౌన్స్ చేసారు సుధీర్. దివ్య భారతి హీరోయిన్ గా నటిస్తున్న ఈమూవీ యొక్క టైటిల్ ని నేడు సుధీర్ బర్త్ డే సందర్భంగా అనౌన్స్ చేసారు. కాగా ఈ మూవీకి G.O.A.T అనే టైటిల్ ఫిక్స్ చేసారు, గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైం అనేది ఉప శీర్షిక. మహాతేజ క్రియేషన్స్, లక్కీ మీడియా సంస్థల పై చంద్ర శేఖర్ రెడ్డి మొగుళ్ల, బెక్కం వేణుగోపాల్ దీనిని గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. లియోన్ జేమ్స్ సంగీతం అందిస్తున్న ఈ మూవీ యొక్క షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ లో జరుగుతోంది. తప్పకుండా మూవీ అందరినీ ఆకట్టుకుంటుందని యూనిట్ ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

# హ్యాపీ బర్త్ డే టూ 'యంగ్ టైగర్ ఎన్టీఆర్'



టాలీవుడ్ స్టార్ హీరోల్లో ఒకరైన యంగ్ టైగర్ ఎన్టీఆర్ ఇటీవల మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ తో కలిసి రాజమౌళి దర్శకత్వంలో రూపొందిన భారీ బ్లాక్ బస్టర్ మూవీ ఆర్ఆర్ఆర్ లో నటించి పెద్ద సక్సెస్ సొంతం చేసుకున్నారు. ఇక ప్రస్తుతం కొరటాల శివ తో దేవర మూవీ చేస్తున్నారు ఎన్టీఆర్. జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ మూవీ పాన్ ఇండియన్ రేంజ్ లో రూపొందుతుండగా దీనిని యువ సుధా ఆర్ట్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. విషయం ఏమిటంటే నేడు యంగ్ టైగర్ ఎన్టీఆర్ 39వ పుట్టినరోజు జరుపుకుంటున్నారు. కాగా పలువురు ప్రేక్షకులు, అభిమానులు తమ సోషల్ మీడియా అకౌంట్స్ ద్వారా ఆయనకు ప్రత్యేకంగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియచేస్తున్నారు. ఇప్పటికే దేవర మూవీ నుండి రిలీజ్ అయిన ఫస్ట్ లుక్ పోస్టర్ అందరినీ ఆకట్టుకోగా మూవీ కూడా గ్రాండ్ రేంజ్ లో తెరకెక్కుతోందని, తప్పకుండా 2024 ఏప్రిల్ 5న రిలీజ్ తరువాత అందరి అంచనాలు మించి సక్సెస్ అవుతుందని యూనిట్ ఆశాభావం వ్యక్తం చేస్తోంది. ఇక యంగ్ టైగర్ కి మా 123 తెలుగు సైట్ తరపున ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియచేస్తూ ఆయన కెరీర్ పరంగా మరిన్ని విజయాలు సొంతం చేసుకోవాలని కోరుకుంటున్నాము.

# దేవర తేడా కొట్టిందో..?



ఎన్.టి.ఆర్ హీరోగా కొరటాల శివ డైరెక్షన్ లో వస్తున్న సినిమా టైటిల్ గా దేవర ఫిక్స్ చేశారు. సముద్రపు రాజుగా ఒళ్లంతా రక్తపు మరకలతో ఎన్.టి.ఆర్ ఉగ్రరూపం తో కనిపిస్తున్నాడు. ఫస్ట్ లుక్ లో తారక్ లుక్స్ ఫ్యాన్స్ కు విపరీతంగా నచ్చేశాయి. ఆర్.ఆర్.ఆర్ తర్వాత ఎన్.టి.ఆర్ కు ఇది పర్ఫెక్ట్ సినిమా అని అంటున్నారు. అయితే ఎక్కడో ఒకచోట కొరటాల శివ మీద డౌట్ మాత్రం అలానే ఉంది. ఆచార్య ముందు వరకు కొరటాల శివ సినిమా అంటే పక్కా హిట్ అనే టాక్ ఉంది. కానీ ఆచార్య ఫ్లాప్ తర్వాత లెక్కలు మారాయి. అదీగాక ఎన్.టి.ఆర్ సినిమా కోసం కథను మార్చి మార్చి రాశారన్న టాక్ కూడా వచ్చింది. ఇక ఫస్ట్ లుక్ కూడా బాగుంది అనిపించి కానీ ఎహే ఇరగదీశారు అనేలా లేదు. అంతేకాదు ఎన్.టి.ఆర్ ఇలా విచిత్ర వేషధారణ ధరించిన సినిమాలన్నీ ఆయనకు రిజల్ట్ లో షాక్ ఇచ్చాయి. అయితే దేవర ఫస్ట్ లుక్ వరకు ఫ్యాన్స్ కి ఐ ఫీస్ట్ అందించింది. సినిమా కాన్సెప్ట్ కరెక్ట్ గా కుదిరితే మాత్రం సినిమా నెక్స్ట్ లెవెల్ లో ఉండే ఛాన్స్ ఉంది. కానీ ఆర్.ఆర్.ఆర్ తర్వాత ఎలాగైనా పాన్ ఇండియా సినిమా తీయాలనే ఆలోచనతో దేవర తీస్తే మాత్రం చాలా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. దేవర టైటిల్ పోస్టర్ మాత్రం అదుర్స్ అనిపించేలా ఉంది. పోస్టర్ లో ఎక్కువగా బ్లాక్ డామినేటెడ్ గా ఉంది. అంతేకాదు సినిమాలో ఎన్.టి.ఆర్ ఇంటెన్స్ మాక్సిమం సీరియస్ మూడ్ లోనే ఉండబోతుందని అర్థమవుతుంది. సినిమా కథ కథనం ఎలా ఉన్నా ఎన్.టి.ఆర్ కు ఆర్.ఆర్.ఆర్ తర్వాత ఆ రేంజ్ హిట్ బొమ్మగా దేవర పడితే ఆ లెక్క సరిపోతుంది. అలా కాకపోతే మాత్రమే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. కొరటాల శివ ఈ సినిమాతో నిజంగానే తనని తాను ప్రూవ్ చేసుకోవాలి. సినిమా అన్ని అనుకున్నట్లుగా జరిగితే బెటరే కానీ ఏమాత్రం తేడా కొట్టినా సరే కొరటాల శివ కెరీర్ రిస్క్ లో పడే అవకాశం ఉంది. సో ఆ జాగ్రత్త తోనే దేవరని తెరకెక్కిస్తున్నాడని చెప్పొచ్చు. ఇక సినిమా పోస్టర్ చూసి ఆహా ఓహో అనడం కన్నా రిలీజ్ అయ్యాక అంచనాలను మించి ఉంటే అప్పుడు విజిల్స్ వేయడం కాదు సీటీలు చించినా సరే దానికి ఒక అర్థం ఉంటుందని చెప్పొచ్చు.

# మాస్ లుక్ లో ఫ్యాన్స్ ని థ్రిల్ చేయనున్న సూపర్ స్టార్ మహేష్ ?



టాలీవుడ్ టాప్ స్టార్స్ లో ఒకరైన సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం త్రివిక్రమ్ తో ఎస్ఎస్ఎంబి 28 మూవీ చేస్తోన్న సంగతి తెలిసిందే. పూజా హెగ్డే, శ్రీలీల హీరోయిన్స్ గా నటిస్తున్న ఈ మూవీని హారికా హాసిని క్రియేషన్స్ సంస్థ పై సూర్యదేవర రాధాకృష్ణ గ్రాండ్ లెవెల్లో నిర్మిస్తున్నారు. థమన్ సంగీతం అందిస్తున్న ఈ మూవీ ఇప్పటికే కొంతమేర షూటింగ్ పూర్తి చేసుకోగా నెక్స్ట్ షెడ్యూల్ ని జూన్ 7 నుండి ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. సూపర్ స్టార్ కృష్ణ గారి జయంతి సందర్భంగా మే 31న ఎస్ఎస్ఎంబి 28 ఫస్ట్ గ్లింప్స్ ని రిలీజ్ చేయనున్నారు మేకర్స్. కాగా లేటెస్ట్ టాలీవుడ్ బజ్ ప్రకారం ఈ గ్లింప్స్ లో సూపర్ స్టార్ మహేష్ బాబు లుంగీ తో మాస్ లుక్ లో ఫ్యాన్స్ ని థ్రిల్ చేయనున్నారట. అలానే గ్లింప్స్ లో థమన్ బీజీఎమ్ కూడా అదరగొట్టనున్నారని, మొత్తంగా అయితే ఈ మూవీ గ్లింప్స్ అందరి అంచనాలు అందుకునేలా కట్ చేస్తున్నారని అంటున్నారు. కాగా ఈ మూవీని 2024 జనవరి 13న విడుదల చేయనున్నారు.

# కొరటాల రియల్ లైఫ్ లో విలువలున్న శ్రీమంతుడు!



స్టార్ డైరెక్టర్ కొరటాల శివ సక్సెస్ లు గురించి చెప్పాల్సిన పనిలేదు. నేటి టాప్ -5 స్టార్ డైరెక్టర్లలో కొరటాల ఒకరు. రైటర్ గా ప్రస్థానం ప్రారంభించి దర్శకుడిగా ఎదిగాడు. స్వయానా పోసాన కృష్ణ మురళీకి మేనల్లు కావడం! అతని కెరీర్ కి కొంతవరకూ కలిసొచ్చింది. మామ దగ్గరే అసిస్టెంట్ గా ప్రయాణం ప్రారంభించి అతను సైతం ఊహించనంత ఎత్తుకు ఎదిగాడు. ఇదంతా కేవలం కొరటాల ట్యాలెంట్ తో మాత్రవే సాధ్యమైంది. పోసాని మేనల్లుడని కోరటాలకి అవకాశాలేవి వెతుక్కొంటు రాలేదు. అతని ప్రతిభని గుర్తించి వచ్చిన అవకాశాలే. శ్రీమంతుడు, జనతా గ్యారేజ్ లాంటి సినిమాలతో కొరటాలలో సెన్సిబుల్ యాంగిల్ బయట పడింది. ఆ రెండు సినిమాలతో కొరటాల రియాల్టీ ఇదని అర్థమైంది. రెండు సినిమాల్లో కొన్ని కామన్ పాయింట్లు కనిపిస్తాయి. వ్యక్తిగతంగా కొరటాల కొన్ని విలువలు పాటిస్తారు. తాజాగా అలాంటి సందర్భం ఒకటి బయటకు వచ్చింది. సాధారణంగా స్టార్ డైరెక్టర్ అయిన తర్వాత కొందరిలో మాట తీరు..ప్రవర్తనా తీరు మారుతుంది. ఎదిగిన తర్వాత తెలిసిన వాళ్లు కంటపడినా తప్పించుకునే వాళ్లు చాలా మంది ఉంటారు. కలిస్తే ఎక్కడ అవకాశం అడుగుతాడోనని? వాళ్లకి ఎలాంటి సమాధానం చెప్పాలో తెలియక తప్పించుకుంటారు. మరికొంత మంది తెలిసినా పట్టించుకోకుండా పోతుంటారు. కానీ కొరటాల మూడవ రకానికి చెందిన వారు. కొరటాల డైరెక్టర్ కాక ముందు..డైరెక్టర్ అయిన తర్వాత ఎలా ఉన్నారు అనడానికి ఈ సన్నివేశం మంచి ఉదాహరణగా చెప్పొచ్చు. పరిశ్రమలో తిరిగే ఓ యువకుడుకి కొరటాల డైరెక్టర్ కాకముందే అన్నపూర్ణ స్టూడియోలో పరిచయం ఏర్పడింది. అప్పుడు చాలా సాధారణంగా ఇద్దరు మాట్లాడుకున్నారు. కట్ చేస్తే కొన్నాళ్లకి కొరటాల పెద్ద డైరెక్టర్ అయ్యారు. ఆ క్రమంలోనే ఆయన దర్శకత్వం వహించిన భరత్ అనే నేను రిలీజ్ అయి పెద్ద సక్సస్ అయింది. అయితే ఈ సినిమా ఈవెంట్ లో తన పాత పరిచయ స్తుడ్ని గుర్తు పట్టి మరీ కొరటాల పలకరించారుట. ఎలా ఉన్నారు? ఏం చేస్తున్నారు? వంటి వివరాలు అడిగి తెలుసుకుని..వెంటనే మేనేజర్ ని పిలిపించి అతని నెంబర్ తీసుకుని ఎప్పుడు అతను తనని కలవాలన్నా వెంటనే అపాయింట్ మెంట్ ఇవ్వు అని..ఫోన్ చేసి విషయం వెంటనే నాకు చెప్పు అని కొరటాల అన్నారుట. ఓ సాధారణ వ్యక్తి కోసం కొరటాల ఆ రోజు అంతలా తపించి మాట్లాడటం అంటే గ్రేట్ కదా. అంత అవసరం ఆయనకేముంది. అందుకే కొరటాల విలువలున్న శ్రీమంతుడయ్యారు.




Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India.
Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com